MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 278 | పేజీలు : 8 | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | వెల : 6-00



వరద నీటిని ఒడిసిపట్టాలి

- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం ఉచితంగా ఇవ్వాలని ఆదేశం
- వరద నీటిని సాధ్యమైనంత ఎక్కువగా నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలి
- భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని సూచన

అమరావతి, మహానగర్

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో నదులు, రిజర్వాయర్లలో పెరిగిన ప్రవాహాలు, ముంపు పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో నివాస ప్రాంతాలు జలమయం కావడం, పంటలు ముంపునకు గురైన పరిస్థితి, చేపడుతున్న సహాయక, పునరావాస చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఐదు రోజులుగా సముద్రంలోకి వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా 50 కేజీల బియ్యం అందించాలని సీఎం ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని, పరిస్థితిని - మిగతా 2లో



ఫారం-6లో చట్ట, రాజ్యాంగ

విరుద్ధమైన మార్పులు

- సీఈసీ ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ ఆగ్రహం
- ఫారం 6లో ఆయన చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేశారని మండిపాటు
- ఓటరు నమోదు ప్రక్రియలో ఈసీ చేసిన మార్పులతో జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపణలు

5

నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం

- రెండు రోజుల్లో 19 మంది మృతి
- ఘటనపై సిట్ దర్యాప్తు ప్రారంభం
- మద్యం నమూనాలు ఫోరెన్సిక్ పరీక్షలకు తరలింపు
- 19 మందిని అరెస్టు చేసిన పోలీసులు
- దాదాపు 3 వేల బాటిళ్ల స్వాధీనం
- అనుమానిత మద్యం సేవించొద్దని పోలీసుల హెచ్చరిక






'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

- నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదు.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారు
- రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి
- ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది
- ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది
- ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు

5

పేదలకు పట్టాభిషేకం



- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు
- రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం
- దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- 8 నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు ప్రయోజనం

అమరావతి, మహానగర్

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత - మిగతా 2లో



పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

- లోక్‌సభ స్పీకర్‌కు జితిన్ రామ్ మాంజీ లేఖ
- సభలో కీలక బిల్లులపై చర్చ జరిగే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అదనపు సమయం ఇవ్వాలన్న మాంజీ
- తమ సామాజిక వర్గానికి తగినంత సమయం అవసరమన్న మాంజీ
- తమ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించాలని విన్నపం

5

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్

- 2 అడుగుల వెడల్పు - 32 అడుగుల ఎత్తు
- విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి
- ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్



అమరావతి, మహానగర్

విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి. ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్. - మిగతా 2లో

పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు

- ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు
- పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు

5



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్

-మొదటిపేజీ తరువాయి

కనిగిరి మండలం వంగపాడు వద్ద కొండను తొలుస్తూ 350 మీటర్లు ఏర్పాటు చేస్తున్న రెండు సొరంగ మార్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 52 అడుగుల వెడల్పు 32 అడుగుల ఎత్తున టన్నెల్స్ నిర్మిస్తున్నారు. విజయవాడ వైపు వెళ్లే దారిలో 300 మీటర్లు, బెంగుళూరు వెళ్లే వైపు మార్గంలో వంద మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. పై గోడల నుంచి మట్టి పెళ్లలు విరిగి పడకుండా ఎప్పటికప్పుడు యంత్రాల సాయంతో కాంక్రీట్‌తో లైనింగ్ చేస్తున్నట్లు మేఘా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అడవిలో కొండల నడుమ సొరంగ మార్గాలు కనువిందు చేస్తున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ వే పూర్తయితే ఇప్పటివరకు 12 గంటలు పాటు పట్టే ప్రయాణ సమయం ఇకపై ఆరు గంటలు మాత్రమే పడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కనిగిరి ప్రాంతం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

342.24 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే

అయితే బెంగళూరు నుంచి విజయవాడ వరకు నేరుగా వెళ్లేందుకు కొత్తగా ఎలాంటి ప్రత్యేక రోడ్డేమీ నిర్మించడం లేదు. బెంగళూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ చెక్‌పోస్ట్‌కు సమీపంలో గల కోడూరు వరకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బెంగళూరు-హైదరాబాద్ హైవేలో 110 కిలోమీటర్లు మేర ప్రయాణించాల్సి వస్తుంది. కోడూరు వద్ద యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే మొదలై, 343.24 కిలోమీటర్లు కొనసాగి ప్రకాశం జిల్లాలోని ముప్పవరం వద్ద చెన్నై-కోల్‌కతా రహదారిలో కలుస్తుంది. అక్కడి నుంచి చెన్నై-కోల్‌కతా రహదారిలో 115 కిలోమీటర్లు ప్రయాణించి విజయవాడకు చేరుకోవాలి. అంటే మధ్య 342.24 కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉంటుంది. దానికి అటూ ఇటూ ఇప్పుడున్న హైవేల్లో 225 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటోంది.



పనులు జరుగుతున్న తీరిది :

ఈ రహదారి శ్రీసత్యసాయి జిల్లాలో చిలమత్తూరు, గోరంట్ల, ఓడీసీ, పుట్టపర్తి, నల్లమాడ, ముదిగుబ్బ మీదుగా తలుపుల మండలంలోని నామాలగుండు వద్ద వైఎస్సార్ కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈ 75 కి.మీ.లో 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. పుట్టపర్తి మండలం సాతర్లపల్లి పరిధిలో కొండను తొలిచే పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నల్లమాడ నుంచి మలకవేముల క్రాస్ వరకు 15 కి.మీ. మేర రహదారి పూర్తయింది. మలకవేముల క్రాస్ వద్ద రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. మలకవేముల క్రాస్ నుంచి కొండగట్టుపల్లి వరకు బీటీ లేయర్ వేస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో వేముల, పులివెందుల, ఎర్రగుంట్ల, కమలాపురం, చాపాడు, మైదుకూరు, పోరుమామిళ్ల మీదుగా ఈ హైవే వెళ్తోంది. కమలాపురం మండలం కంచెన్నగారిపల్లె వద్ద పెన్నా నదిపై, చాపాడు మండలం అల్లాడుపల్లి వద్ద కుందూ నదిపై భారీ వంతెనల నిర్మాణం, మిగిలిన ప్రాంతాల్లో రోడ్ల పనులు జరుగుతున్నాయి. ఈ జిల్లాలో కొన్నిచోట్ల భూసేకరణ సమస్యలతో పనులు జాప్యమవుతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా అత్యధికంగా 140 కి.మీ. ఉంది. సింగరాయకొండ నుంచి మైదుకూరు వైపు వెళ్లే ఎన్‌హెచ్-167బీ వద్ద ఇంటర్ ఛేంజ్ పనులు చేస్తున్నారు. మర్రిపూడి నుంచి సోమవరప్పాడు వరకు 13వ ప్యాకేజీలో పనులు చాలావరకు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌లో 5.31 కి.మీ. మేర ఏడు సొరంగాలు నిర్మిస్తున్నారు. నెల్లూరు జిల్లా సీతారామపురం మండల సరిహద్దులోని 3.67 కి.మీ. పొడవైన సొరంగం ప్రాజెక్ట్‌లో అతి పెద్దది.

అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ!

గుంటూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు.మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు.చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత



సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి.ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ-ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.

ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా



పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.వంద శాతం స్టయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

వరద నీటిని ఒడిసిపట్టాలి

-మొదటిపేజీ తరువాయి

ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. స్థానికంగా వస్తున్న వరద నీటిని సాధ్యమైనంత ఎక్కువగా నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య కొత్త బ్యారేజీ నిర్మాణం అవసరముందని, అలాగే ప్రకాశం బ్యారేజీ దిగువన మరో బ్యారేజీ నిర్మాణంపై గతంలో రూపొందించిన ప్రతిపాదనలను కూడా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. రెండు బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. హిరమండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సొకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో తక్షణమే ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. లిఫ్ట్ పనులను పూర్తి చేసి వంశధార నీటిని హిరమండలం రిజర్వాయర్‌లోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాజా వర్షాలతో రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కోస్తాంధ్రలో 19.80 శాతం, రాయలసీమలో 42 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు వివరించారు. ఉత్తరాంధ్రలో ఎగువ ప్రాంతాల నుంచి నదుల్లోకి నీటి ప్రవాహాలు కొనసాగుతున్నందున పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను కొనసాగించాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 29 రిజర్వాయర్లలో నీటి మట్టాలు పెరిగాయని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 23న ఆయా రిజర్వాయర్లలో 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వలు సెప్టెంబర్ 26 నాటికి సుమారు 21 టీఎంసీల మేర పెరిగినట్లు వివరించారు. ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లో సుమారు 5 టీఎంసీలు, కాకినాడ, పోలవరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, నెల్లూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లోని 18 రిజర్వాయర్లలో సుమారు 16 టీఎంసీల మేర నీటి మట్టాలు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. పెరిగిన నీటి నిల్వలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. కృష్ణా, గోదావరి, నాగావళి, వంశధార బేసిన్లలో నీటి ప్రవాహాలు గతంతో పోలిస్తే పెరిగినట్లు అధికారులు తెలిపారు. వంశధార పరివాహక ప్రాంతంలోని గోట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 20న 7,214 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సెప్టెంబర్ 25న 47,100 క్యూసెక్కులకు పెరిగింది. నాగావళి పరివాహక ప్రాంతంలోని నారాయణపురం ఆనకట్టకు ఇన్‌ఫ్లో 2,100 నుంచి 49,800 క్యూసెక్కులకు పెరిగింది. మడ్డువలస ప్రాజెక్టులో ప్రవాహం 918 నుంచి సుమారు 18,000 క్యూసెక్కులకు పెరగడంతో నీటి నిల్వ 1.61 టీఎంసీల నుంచి 2.79 టీఎంసీలకు చేరింది. తోటపల్లి బ్యారేజీకి వచ్చే ప్రవాహం 2,484 నుంచి 23,250 క్యూసెక్కులకు పెరిగింది. గోదావరి పరివాహక ప్రాంతంలోని డొంకరాయి రిజర్వాయర్‌లో నిల్వ సెప్టెంబర్ 20న 11.67 టీఎంసీల నుంచి సెప్టెంబర్ 25న 15.78 టీఎంసీలకు పెరిగింది. సీలేరు (గుంటవాడ) రిజర్వాయర్‌లో నిల్వ 1.52 నుంచి 3.90 టీఎంసీలకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం సెప్టెంబర్ 20న 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి సెప్టెంబర్ 25న 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. ప్రకాశం బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో 8,187 నుంచి 40,521 క్యూసెక్కులకు, మున్నేరుకు వచ్చే ప్రవాహం 3,210 నుంచి 9,000 క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. పెరిగిన ప్రవాహాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. ఒకవైపు సహాయక చర్యలపై దృష్టి సారిస్తూనే మరోవైపు రిజర్వాయర్లకు నీటిని మళ్లించాలని, చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగం, నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సహా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు టెలీకాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'



-మొదటిపేజీ తరువాయి

కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించు కున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాం క్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నాయి.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల సంఖ్య:

విజయవాడ (తూర్పు) – 7,990, విజయవాడ (పశ్చిమం) – 7,465, విజయవాడ (సెంట్రల్) – 5,815, గన్నవరం – 602, జగ్గయ్యపేట – 1,135, మైలవరం – 981 నందిగామ – 54 తిరువూరు – 15

అడ్వైజర్లు, డిస్ట్రిబ్యూషన్ భాగస్వాముల కోసం 'ఐసీఐసీఐ లైఫ్ పార్ట్నర్ స్టాక్ 2.0'

అమరావతి

అడ్వైజర్లు, డిస్ట్రిబ్యూషన్ భాగస్వాముల డిజిటల్ సామర్థ్యాలను మరింత పెంచే లక్ష్యంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 'ఐసీఐసీఐ లైఫ్ పార్ట్నర్ స్టాక్ 2.0'ను ఆవిష్కరించింది. ఏఐ ఆధారిత టూల్స్, భాగస్వామి వ్యవస్థలతో మెరుగైన అనుసంధానం, సేల్స్, ఆన్బోర్డింగ్, కస్టమర్ సర్వీసింగ్‌కు సంబంధించిన డిజిటల్ సదుపాయాలను ఇందులో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈకోట్ యాప్ ద్వారా కస్టమర్ సెగ్మెంట్, జీవిత దశ ఆధారంగా తగిన బీమా ఉత్పత్తులను ఏఐ సాయంతో సిఫార్సు చేయడంతో పాటు వ్యక్తిగతీకరించిన కొటేషన్లను రూపొందించి షేర్ చేసుకునే అవకాశం అడ్వైజర్లకు కల్పించింది. లివా ఏఐ చాట్‌బాట్ ద్వారా ఉత్పత్తి ఫీచర్లు, కొటేషన్లను సులభంగా యాక్సెస్ చేసుకోవచ్చు. పార్ట్నర్ సీఆర్ఎం ప్లాట్‌ఫాంలతో అనుసంధానం, ఏపీఐల ద్వారా సర్వీస్ రిక్వెస్టులు, క్లెయిమ్స్, సభ్యుల వివరాలను డిజిటల్‌గా నిర్వహించుకునే వీలుంది. ఆధార్, సీకేవైసీ, వాహన్, జీఎస్టీఎన్, ఈపీఎఫ్ఓ, సీఏఎస్, పెర్ఫియోస్ వంటి డేటాబేస్‌ల అనుసంధానం వల్ల అప్లికేషన్‌లో దాదాపు 70 శాతం వరకు వివరాలు ముందుగానే నింపే సదుపాయం లభిస్తుంది. ఏఎస్బీఏ, వాట్సాప్ పేమెంట్స్‌తో ప్రీమియం చెల్లింపుల సౌకర్యం కల్పించింది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం 200కు పైగా పార్ట్నర్-సిస్టమ్ ఇంటిగ్రేషన్స్ ఉన్నాయి.

దేవాపూర్‌లో గ్రామీణ విద్యా మౌలిక సదుపాయాల బలోపేతం




హైదరాబాద్, మహానగర్

అంబుజా సిమెంట్స్, అదానీ ఫౌండేషన్ సంయుక్తంగా దేవాపూర్‌లోని గట్రావుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచాయి. 28 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో నీటి నిల్వ, రక్షణ లేని ప్రాంగణం, తగిన మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉండటంతో తరగతులు, పారిశుధ్యం, మధ్యాహ్న భోజన నిర్వహణపై ప్రభావం పడుతోంది. ఈ సమస్యల పరిష్కారంలో భాగంగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ, ప్రాంగణంలో కాంక్రీట్ ఫ్లోరింగ్, ప్రత్యేక వంటశాలను ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో నీటి నిల్వ సమస్య తగ్గడంతో పాటు భద్రత, పరిశుభ్రత మెరుగుపడ్డాయి. మధ్యాహ్న భోజనాలను పరిశుభ్రమైన వాతావరణంలో సిద్ధం చేసేందుకు అవకాశం ఏర్పడింది. మెరుగైన మౌలిక సదుపాయాలతో విద్యార్థుల హాజరు పెరగడంతో పాటు బోధన-అభ్యాసానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని సంస్థలు తెలిపాయి. తల్లిదండ్రుల్లోనూ పాఠశాలపై విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా మౌలిక వసతుల బలోపేతానికి తమ నిబద్ధతలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అంబుజా సిమెంట్స్, అదానీ ఫౌండేషన్ తెలిపాయి.

దయ, ప్రేమతో జీవిస్తేనే జీవితం ధన్యం

- సూఫీ హజరత్ అతా నిజామ్ బాబా

జంపని, మహానగర్



సాటివారి పట్ల దయ, ప్రేమ, సేవా భావంతో జీవించినప్పుడే మానవ జీవితం ధన్యమవుతుందని సూఫీ హజరత్ అతా నిజామ్ బాబా అన్నారు. గ్రామంలోని సూఫీ అతా నిజామ్ బాబా ఆస్తానా నుంచి శనివారం మధ్యాహ్నం ఎన్టీఆర్ జిల్లా చీమలపాడు షరీఫ్‌లోని హజరత్ ముహమ్మద్ అతా ఉల్లా బాబా వారి 5వ ఉరుసు మహోత్సవానికి గంధం సమర్పించేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో బయలుదేరారు. ఈ సందర్భంగా కొండపల్లి షా బుఖరి దర్గా నుంచి హజరత్ ముహమ్మద్ అల్తాఫ్ అలీ రాజా తాజ్ ఖాద్రి బాబా, నాగపూర్ తాజ్ బాబా దర్గా నుంచి జనాబ్ తాజ్ అహ్మద్ రాజా సాహెబ్, జనాబ్ ఇమ్రాన్ ఖాన్ సాహెబ్, జనాబ్ మొబీన్ తాజ్ సాహెబ్, జనాబ్ వసీం భాయ్, జనాబ్ నయీమ్ తాజ్ సాహెబ్, జనాబ్ ఎజాజున్ హాజీ సాహెబ్, జనాబ్ సిబ్గైన్ రజా సాహెబ్, జనాబ్ సర్ఫరాజ్ సాహెబ్, జనాబ్ మన్సూర్ సాహెబ్, జనాబ్ సయ్యద్ రౌఫ్ సాహెబ్, జనాబ్ అష్రఫ్ ఖాన్ సాహెబ్, జనాబ్ మహ్మూద్ ఖాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. పెనుగొండ బాబా ఫకృద్దీన్ దర్గా నుంచి సూఫీ పెద్దలు కూడా పాల్గొన్నారు. ఉరుసు మహోత్సవంలో భాగంగా ఫకీరుల డప్పులు, కోలాటం, నాగపూర్ ప్రత్యేక ఖవ్వాలి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంధం సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూఫీ హజరత్ అతా నిజామ్ బాబా మాట్లాడుతూ, తమ గురువుగారైన చీమలపాడు షరీఫ్ హజరత్ అతా ఉల్లా బాబా వారి అనుగ్రహంతో సూఫీ మార్గాన్ని అనుసరిస్తూ జాతి, కుల, మత భేదాలకు అతీతంగా సమాజ సేవ చేస్తున్నట్లు తెలిపారు. హజరత్ అతా ఉల్లా బాబా వారి ఉరుసు మహోత్సవానికి ప్రతి సంవత్సరం జంపని గ్రామంలోని తమ సూఫీ అతా నిజామ్ బాబా ఆస్తానా నుంచి గంధం తీసుకెళ్లి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. సూఫీ మహాత్ములు బోధించిన ప్రేమ, దయ, మానవత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అతా నిజామ్ బాబా పిలుపునిచ్చారు.

పోలింగ్ బూత్ మార్చాలని వినతి

జగ్గయ్యపేట, మహానగర్



రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డుకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని మార్చాలని కోరుతూ వార్డుకు చెందిన గడ్డం రాంబాబు యాదవ్ మున్సిపల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గతంలో 7వ వార్డుగా ఉన్న ప్రాంతం ప్రస్తుత డీలిమిటేషన్‌లో 8వ వార్డుగా మారిందని తెలిపారు. 8వ వార్డుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని తొర్రగుంటపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారని, దీనిపై అభ్యంతరాలు ఉంటే శనివారం సాయంత్రంలోగా తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని తెలిపారు. అదే పాఠశాలలో 8, 9, 10 వార్డులకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సుమారు 3 వేల మంది ఓటర్లు ఒకే ప్రాంతానికి వచ్చే అవకాశం ఉండటంతో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా 8వ వార్డు ప్రజలకు ఆ పాఠశాల దూరంగా ఉండటంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. 8వ వార్డు ఓటర్లకు అందుబాటులో ఉండేలా మున్సిపల్ పార్కులోని 40 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఇదే ప్రాంతంలోని బూస్టర్ రూమ్‌లో ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ అభ్యంతరాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రాంబాబు యాదవ్ తెలిపారు.

వడ్రంగుల కోసం యాక్షన్ టేసా ప్రయోజన కార్యక్రమాలు



విజయవాడ

జాతీయ వడ్రంగి దినోత్సవం సందర్భంగా యాక్షన్ గ్రూప్‌లో భాగమైన యాక్షన్ టేసా వడ్రంగుల కోసం పలు ప్రయోజన కార్యక్రమాలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 50కి పైగా ప్రాంతాల్లో సెప్టెంబర్ 24న నిర్వహించిన కార్యక్రమాలను "సంగ్ సంగ్ చలే, ఆగే బఢేన్" అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఫర్నిచర్, ఇంటీరియర్ రంగాలకు వడ్రంగులు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ వారి కుటుంబ సంక్షేమం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ప్రమాద బీమాకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సంస్థ తెలిపింది. 2026--27 ప్రయోజన కార్యక్రమంలో భాగంగా వడ్రంగి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి యాక్షన్ టేసా ఉత్పత్తులతో రూపొందించిన ఫర్నిచర్ ప్యాకేజీ రూపంలో రూ.50 వేల వరకు సహాయం, ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.11 వేల స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు పేర్కొంది. అలాగే 'సూపర్ 30' కార్యక్రమం ద్వారా ఎంపికైన వారికి ఎంఎస్ఎంఈతో కలిసి మూడు నెలల రెసిడెన్షియల్ నైపుణ్యాభివృద్ధి శిక్షణను భోజనం, వసతితో సహా అందించనుంది. సభ్యులకు రూ.2 లక్షల వరకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ కల్పించనుంది. ఈ ప్రయోజనాలను యాక్షన్ టేసా కనెక్ట్ యాప్ ద్వారా అందిస్తామని, వివరాల కోసం సమీప శాఖ, సేల్స్ మేనేజర్‌ను సంప్రదించాలని సూచించింది. హెల్ప్‌లైన్ 1800-309-0707 ద్వారా కూడా సమాచారం పొందవచ్చని తెలిపింది.

రద్దీ నియంత్రణ, భక్తుల భద్రతే ప్రథమ ప్రాధాన్యం

సీపీ ఎస్.వి. రాజశేఖరబాబు

ఇంద్రకీలాద్రిపై దసరా భద్రతా ఏర్పాట్ల పరిశీలన



విజయవాడ, మహానగర్

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరగనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్‌తో కలిసి కొండపైన, పరిసర ప్రాంతాల్లో భక్తుల రాకపోకలు, క్యూలైన్ల నిర్వహణ, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. కొండపై ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల మార్గాలు, బారికేడింగ్ పటిష్టత, వివిధ పూజలు నిర్వహించే ప్రదేశాలను పరిశీలించిన సీపీ, రద్దీ అధికంగా ఉండే సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మహా మండపంలోని ఖాళీ ప్రదేశాల్లో భక్తులను వేచి ఉంచే అవకాశాలను పరిశీలించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా పోలీస్ శాఖ, దేవస్థానం సమన్వయంతో పనిచేస్తున్నాయని సీపీ తెలిపారు. దసరా ఉత్సవాల సందర్భంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు సీసీటీవీ కెమెరాలు, ఏఐ నిఘా వ్యవస్థ ద్వారా భక్తుల భద్రతను 24 గంటలూ పర్యవేక్షిస్తామని చెప్పారు. భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గుణ రామ్, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.రమ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు వి.శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ ప్రారంభం



విజయవాడ

మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ పోరంకిలో తమ రెండో శాఖను ప్రారంభించింది. శనివారం, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు, తాడిగడప మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. విజయవాడలో విస్తరిస్తున్న వైద్య సేవలకు అనుగుణంగా పోరంకిలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో శుక్లాలు, గ్లాకోమా, రెటీనా సమస్యలు, రిఫ్రాక్టివ్ సర్జరీ, పిల్లల కంటి సంరక్షణతో పాటు వివిధ దృష్టి సమస్యలకు కన్సల్టేషన్, నిర్ధారణ పరీక్షలు, శస్త్రచికిత్స సేవలు అందుబాటులో ఉంటాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.ఎస్.కె. వేలు మాట్లాడుతూ విజయవాడ తమకు కీలకమైన ప్రాంతమని, రెండో ఆసుపత్రి ప్రారంభంతో పరిసర ప్రాంతాల ప్రజలకు వారి నివాస ప్రాంతాలకు చేరువగా కంటి వైద్య సేవలు అందించగలుగుతున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, బలమైన క్లినికల్ విధానంతో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. చీఫ్ మెంటర్ డాక్టర్ కె.పి. రెడ్డి మాట్లాడుతూ 2003లో విజయవాడలో మాక్సివిజన్ ప్రారంభమైందని, ఆంధ్రప్రదేశ్‌లో లాసిక్ విధానాన్ని తొలిసారిగా తమ సంస్థ పరిచయం చేసిందని తెలిపారు. అప్పటి నుంచి రాష్ట్రంలో అనేక ఆధునిక కంటి వైద్య సాంకేతికతలను అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. మాక్సివిజన్ విజయవాడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. రామకృష్ణ మాట్లాడుతూ కంటి సమస్యలను సకాలంలో గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స అందించవచ్చన్నారు. పోరంకి కేంద్రంలో అత్యాధునిక సాంకేతికతతో నిపుణుల సలహాలు, నిర్ధారణ పరీక్షలు, తగిన చికిత్సా విధానాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 90కి పైగా కేంద్రాలతో సేవలు అందిస్తున్న మాక్సివిజన్, విజయవాడలో రెండో కేంద్రం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలను మరింత విస్తరిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి సిద్ధం


విజయవాడ, మహానగర్



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయించారు. నగరంలోని డివి మేనర్ హోటల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై ప్రధానంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి గ్రామం, ప్రతి వార్డు స్థాయికి తీసుకెళ్లేలా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. రానున్న ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ శ్రేణులు సంపూర్ణ సహకారం అందించాలని, పోటీ చేసే అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో 100 శాతం స్ట్రైక్ రేట్ లక్ష్యంగా నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణను పటిష్టంగా అమలు చేయాలని నిర్ణయించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య నిరంతర సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకుంటూ ఎన్నికలను సమష్టిగా ఎదుర్కోవాలని సమావేశంలో పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితి, స్థానిక రాజకీయ సమీకరణాలు, కూటమి శ్రేణుల సమన్వయం, అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో పార్టీ నాయకులు మరింత చురుకుగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పార్లమెంటరీ ఎన్నికల ఇన్‌చార్జ్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బోండా ఉమా, తంగిరాల సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బోలియాశెట్టి శ్రీకాంత్, విజయవాడ సెంట్రల్ సమన్వయకర్త బొలిశెట్టి వంశీ, మైలవరం ఇన్‌చార్జ్ అక్కల రామమోహన్ (గాంధీ), నందిగామ ఇన్‌చార్జ్ రమాదేవి, తిరువూరు సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు, స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యులాలు బండి కోమలి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, సెంట్రల్ పార్టీ ఆఫీస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు అసలైన అగ్నిపరీక్ష

న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం సేవా తీర్థ్ వేదికగా కేంద్ర మంత్రులందరితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు నిర్వహించిన ఉన్నత స్థాయి మేధోమథన సదస్సు హాట్ టాపిక్ అయింది. ఎన్డీయే-3 ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి స్థాయి మంత్రుల మండలితో ప్రధాని ఇంతటి సుదీర్ఘ అంతర్గత సమీక్ష నిర్వహించడం ఇదే ప్రథమం. కేవలం విధానపరమైన నిర్ణయాలకే పరిమితం కాకుండా.. గత కొన్ని నెలలుగా వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న వేగం, వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్ అమలుపై మోదీ లోతుగా సమీక్షించారు. కేంద్ర మంత్రులను ఎనిమిది ప్రత్యేక బృందాలుగా విభజించి, ప్రతి గ్రూపుతో విడివిడిగా సంభాషిస్తూ క్షేత్రస్థాయి ఫలితాలు ఎలా ఉన్నాయో కూలంకషంగా ఆరా తీశారురెండు రోజుల మేధోమథన సదస్సు ప్రధానంగా పరిపాలనా సంస్కరణలు, ప్రజా సంక్షేమ పథకాల డెలివరీ మెకానిజం చుట్టూనే తిరిగింది. బ్యూరోక్రసీపై పూర్తిగా ఆధారపడటం మానుకోవాలని, మంత్రులు స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. యువత, మహిళలకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయికి ఎంతవరకు చేరుతున్నాయన్న దానిపై గ్రౌండ్ రిపోర్టులు తెప్పించుకుని పరిశీలించారు. శాఖల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. తాజా సమీక్షలో పలువురు మంత్రుల పనితీరు ఆశాజనకంగా లేదని తేలడంతో పాటు, కొందరి పోర్ట్‌ఫోలియోల్లో ఆశించిన వేగం కనిపించలేదన్న నివేదికలను ప్రధాని నేరుగా వారి ముందే ఉంచినట్లు సమాచారం.ఈ భారీ కసరత్తు పూర్తవడంతో కేంద్ర కేబినెట్‌లో ఎవరిని ఉంచాలి? ఎవరిని సాగనంపాలి? అనే అంశంపై ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నాయకత్వానికి ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల తర్వాత కూటమి భాగస్వామ్యాల లెక్కలతో ఏర్పడిన మంత్రివర్గంలో కొందరికి అదనపు బాధ్యతలు ఉండగా, మరికొందరు ఆశించిన స్థాయి పనితీరును కనబరచలేకపోయారు. రాబోయే పలు కీలక రాష్ట్రాల శాసనసభ ఎన్నికల సమీకరణాలు, సామాజిక సమతుల్యత, పాలనా సామర్థ్యమే గీటురాయిగా మంత్రుల



ర్యాంకింగ్‌లు, రిపోర్ట్ కార్డులను సిద్ధం చేశారు. ఆశించిన ఫలితాలు ఇవ్వని పలువురు మంత్రులను కేబినెట్ నుంచి తప్పించి పార్టీ సంస్థాగత బాధ్యతలకు పరిమితం చేయవచ్చని తెలుస్తోందికేంద్ర మంత్రివర్గంలో పెను మార్పులు, చేర్పులు త్వరలోనే ఉండబోతున్నాయన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. దాదాపు 15 నుంచి 17 కొత్త ముఖాలకు కేబినెట్ లేదా సహాయ మంత్రుల హోదాలో చోటు కల్పించవచ్చని, యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూనే పనితీరు బాగున్న కొందరు సహాయ మంత్రులకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సంస్కరణల అమలు, వికసిత్ భారత్-2047 ప్లాన్ అమలుపై సమీక్ష నిర్వహించి,, కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈ చింతన్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాగే జాతీయ స్థాయిలో తాజా రాజకీయ పరిణామాలు, మంత్రుల పనితీరు సమీక్ష, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ ప్రాధాన్యతలు మార్చుకోవడంపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. మరోవైపు విజన్-2047 స్వల్పకాలిక, దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడానికి రంగాల వారీగా 10 కార్యదర్శుల బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రధాని మోడీ.. వాటిపై ఇవాళ మరోసారి ప్రజంటేషన్లు తీసుకునే అవకాశం ఉంది. అలాగే జంతర్ మంతర్ ఆందోళనల తర్వాత మంత్రుల పనితీరుపై ప్రధాని మోడీ రెగ్యులర్ గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని కోరుతున్నారు. అంతే కాదు వీటిపైనా నివేదికలు తెప్పించుకుంటున్నారు. తాను కూడా స్వయంగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజా నివేదికల ఆధారంగా మంత్రుల పనితీరును ప్రధాని కొలవబోతున్నారు. అలాగే దీంతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని చింతన్ శిబిర్ లు కూడా ఏర్పాటు చేస్తామని సంకేతాలు ఇస్తున్నారు. ఇవన్నీ అంతిమంగా కేబినెట్ లో మార్పులపై మంత్రుల్లో వస్తున్న వ్యతిరేకతను వాడుకుంటూ ప్రక్షాళనకు ప్రధాని దారులు తెరుస్తారనే చర్చ కూడా జరుగుతోంది. అదే జరిగితే త్వరలో చేపట్టే కేబినెట్ ప్రక్షాళనపై చింతన్ శిబిర్ రిపోర్టుల ప్రభావం కూడా ఉండబోతోంది. సమయంలో కీలక భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూలతో పాటు ఇతర ఎన్డీయే మిత్రులకు ప్రాతినిధ్యం పెంచడం లేదా అదనపు శాఖలు కేటాయించే కసరత్తు కూడా కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ చింతన్ శివిర్ కేవలం సమీక్ష మాత్రమే కాదని, మోదీ మార్క్ నిర్దాక్షిణ్య ప్రక్షాళనకు వేసిన బలమైన పునాది అని గట్టిగానే గుసగుసలు వినిపిస్తున్నాయి.

మానవాళిపై ఏఐ ప్రభావం ఎలా?



ప్రపంచంలో ఏం జరుగుతున్నదో మీరంతా గమనిస్తున్నారా? మీరు సరిగా నిద్రపోతున్నారా? నేనయితే సరిగా నిద్ర పోవడంలేదు. ఒక కీలకమైన నాగరికతకు సంబంధించిన మార్పును పరిశీలిస్తున్నాను. ఇలాంటి క్లాస్‌లు చెప్పడం, కోర్సులు మనుగడ సాగిస్తాయని అనుకుంటున్నారా? ఇది కోర్సుకు, మీకు, నాకు సంబంధించిన విషయం కాదు, ఇది మానవాళికి సంబంధించిన అంశం. ఇప్పుడు మనమంతా ఒక కొత్త నాగరికతకు సంబంధించిన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. దీన్ని ప్రజలు గమనిస్తున్నారో, లేకపోతే నేనే ఓ గోడపై దెయ్యం బొమ్మను చిత్రీకరిస్తున్నానో తెలియడంలేదు. అసలు ఏం జరుగుతున్నదో మీరు గమనిస్తున్నారా? ఏఐ విషయంలో చాలా రకాల వేదాంతపరమైన, తాత్వికమైన, మనుగడకు సంబంధించిన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఒకవేళ విజ్ఞానం, ఆలోచించడం అనేవి వాణిజ్య వస్తువులుగా మారితే, మన మనుగడకు అర్థమేముంటుంది? ఇన్నాళ్లూ మానవులుగా మనం మేధస్సు కలిగిన వాళ్లం అని అనుకుంటూ ఉన్నాం. ఇప్పుడు యంత్రాలు కూడా అదే పనిచేస్తున్నాయి. సరే, అదొక తాత్వికమైన వాదన. కానీ ఆర్థికపరమైన పరిణామాల గురించి ఆలోచించండి. నా జీవితంలో ఏం జరుగుతున్నదో చెప్తాను. నేను సిబ్బందిని నియమించుకోవడం ఆపేశాను. ఎందుకంటే మనుషులు ఇకపై పనిని సులభతరం చేసేవారిగా కాకుండా, అడ్డంకులుగా మారారు. నా కోసం వంద మంది ఏఐ ఏజెంట్స్ సమాంతరంగా పని చేస్తుంటే, నేను సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరమేమున్నది? నాకు ఒక ఆలోచన వచ్చింది. నేను 100 మంది ఏజెంట్లను స్పిన్ చేసి, మరికొన్ని క్లాట్ సబ్‌స్క్రిప్షన్‌లను పొందుతాను.

ఇక మనుషుల అవసరమేముంటుంది? కొన్ని రోజుల క్రితం నేను హింటన్ ప్రసంగం విన్నాను. ఆయన ఏం చెప్పారంటే మేధస్సు వ్యాపార సరుకైతే, అది చౌకకు దొరికితే, ఆలోచన కూడా తక్కువ ధరకు లభిస్తే ఏం జరుగుతుంది? అనేది వివరించారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అంతా కూడా మేధస్సు, జ్ఞానం మీద ఆధారపడి నడుస్తున్నది. ఇప్పుడు అది వ్యాపార వస్తువుగా మారి, చౌకగా దొరికితే తర్వాత పరిస్థితి ఏంది? ఒక గొప్ప ఆలోచన దృక్పథం ఏందంటే, ఏఐ ద్వారా చాలా పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతుంది. ఎందుకంటే ఉత్పత్తి ఖర్చు తగ్గిపోతుంది కాబట్టి. ఇలాంటి పరిస్థితిలో ఎవరైనా సంతోషంగానే ఉంటారు కదా! కానీ అది జరుగుతుందా? హింటన్ వాదన ఏందంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి అనేది ప్రతి ఒక్కరికీ సంతోషంగా మారలేదు. ఇది కేవలం ఎక్కువ ఉత్పత్తి ఉన్నవాళ్లకు, ఏమీ లేని వాళ్లకు మధ్య విభజనను మాత్రమే సృష్టిస్తుంది.

ప్రతిభ ఆధారిత వ్యవస్థలో సమయం, శ్రమను వెచ్చించి కొందరు జ్ఞానం పొందుతారు. సమాజంలో నైపుణ్యం ఆధారంగా అంచెలవారీ వ్యవస్థ ఉన్నది. ఇప్పుడు అది తొలగించి చూడండి. మనుషులంతా సమానం, కొందరు 'ఎక్కువ' సమానం అవుతారు. ఎందుకంటే ఆ కొందరు మేధస్సును సృష్టించగలరు కాబట్టి. మీకు తెలుసా? జీపీటీ ఆస్ట్రా జీపీ 6 అనేది లక్ష జీపీయూలను ట్రైన్ చేసింది. మన దేశం కూడా లక్ష జీపీయూలను కలిగి లేదు. ఎవరైతే అలాంటి వ్యవస్థను నియంత్రించగలరో వాళ్లే జాగీర్దారుల తరహాలో తయారవుతారు. ఏ వస్తువులు ఎక్కడికి వెళ్లాలో నిర్ణయిస్తారు. అప్పుడు ఏం జరుగుతుంది? ప్రపంచంలో 50 ఏండ్లుగా ఏర్పడిన తరహా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇప్పటికే ఉద్యోగాల తొలగింపును చూస్తున్నాం.. ఇంకా చూస్తాం.

కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వవు, అప్పుడు యూనివర్సిటీలు ఏం చేయాలి? ప్రభుత్వాలు ఏం చేయాలి? అసలు యూనివర్సిటీల్లో ఏం బోధించాల్సి ఉంటుంది? విద్యార్థులను క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టి అల్గారిథం రాయాలని చెప్పాల్సిన అవసరం ఏముంటుంది? మనుషులుగా మనకు ఎలాంటి అవకాశాలు లేకపోతే, మనం ఏం చేయాలి? ఆర్థికశాస్త్రాన్ని ఎలా నిర్వహించాల్సి ఉంటుంది? క్రమంగా వస్తు మార్పిడి పద్ధతి వస్తుందేమో!

నేనొక ఆర్టికల్ చదివాను. అందులో ఏమున్నదంటే! ప్రతి ఒక్కరికీ ఉండటానికి చోటు, తినడానికి తిండి, వినోదం కోసం ఏవైనా యూట్యూబ్ వీడియోస్ చూసుకునే అవకాశం కల్పిస్తే అందరూ సంతోషంగా ఉంటారా? ఉండము. రోడ్ల మీదకు వచ్చి ఫైట్ చేస్తాం. ఎందుకు అంటే.. ఏమో చెప్పలేం. సమాజం ఎక్కడికి పోతున్నదో కూడా అర్థం కావడంలేదు. ఇలాంటి చర్చలు జరుగాలి. ఎవరో ఒకరు ఏదో చేయాలి. ఇప్పుడిదంతా తాత్వికమైన చర్చగా మారింది. మరో వాదన కూడా ఉన్నది. నా భార్య తరచుగా అడుగుతూ ఉంటుంది. కాలిక్యులేటర్లు వచ్చాయని మనం కూడికలు, తీసివేతలు వంటివి నేర్చుకోవడం మానేయలేదు కదా అని. నిజమే కదా, అది సరైన వాదననే. ఇక మీరంతా నా క్లాస్‌రూమ్‌కు రాకపోయినా ఏఐ ద్వారా నేర్చుకునే అవకాశం ఉంటే, రావాల్సిన అవసరమేముంటుంది? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. మా కూతురు చెప్తున్నది. జీపీటీ బెస్ట్ టీచర్, మీకంటే ఓపికగా సమాధానం చెప్తున్నది.

ఎన్నిసార్లు అడిగినా విసుక్కోకుండా, తిట్టకుండా నేర్పిస్తున్నది అని అంటున్నది. అవన్నీ కూడా సరైన వాదనలే కదా! ఇంకా మౌలిక ప్రశ్న ఏందంటే.. అసలు మనం ఎందుకు నేర్చుకోవాలి? అనేది ఒక ప్రశ్న అయితే, ఏం నేర్చుకోవాలి? అనేది ఇంకో ప్రశ్న. అలాగే మీరంతా నేర్చుకోవడానికి ఇక్కడికి ఎందుకు వచ్చారు. సరే, మనుషులు సోషల్ యానిమల్స్ కాబట్టి, సోషలైజ్ కావడానికి వచ్చామంటే ఓకే. సోషలైజ్ కావడానికే అంటే పార్క్‌కు పోవచ్చు, యూనివర్సిటీకే ఎందుకు వచ్చారనేది మరో ప్రశ్న కదా! యూనివర్సిటీ అంటే మేధోపరమైన అంశాలపై చర్చిస్తూ ఉత్తేజం పొందే స్థలం అని చెప్పడం బాగుంది కదా! సాంకేతిక రంగంలో వచ్చే మార్పులు కింది నుంచి పైస్థాయికి ఉండవు. పై నుంచి కిందికి ఉంటాయి. కాబట్టి ఇలాంటి అంశాలపై ముందుగా మనలాంటి వాళ్లం చర్చించుకోవాల్సిన అవసరమున్నది. దీనిపై అంతా చర్చించుకోవాలి. ఎందుకంటే అందరిలోనూ ఆందోళన వ్యక్తమవుతున్నది.

నా అభిప్రాయం ప్రకారం మనలో తగినంత సృజనాత్మకత లోపించింది. ఉదాహరణకు ఒక తరగతి గదిలో 100 మంది విద్యార్థులు ఉన్నారని అనుకుందాం. మనం వారికి 100 వేర్వేరు సమస్యలను ఇచ్చి, వారి ప్రతిభను అంచనా వేయడానికి ఒకటే పద్ధతిని అనుసరించగలమా? లేదు. చివరికి మనం ఇచ్చే గ్రేడ్ అనేది పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ నేను మీకు ఒక ఓపెన్ ప్రాబ్లెమ్ ఇచ్చి, మీకు నచ్చినట్టుగా పరిష్కరించండి అని అడిగాను అనుకోండి. అప్పుడు ఆ 100 మంది విద్యార్థులూ ఒక లార్జ్ లాంగ్వేజ్ మాడల్‌కు ఒక ప్రాంప్ట్ ఇచ్చి, దాని ద్వారా వచ్చిన సమాధానాన్ని సబ్మిట్ చేస్తే, నేను వాటిని ఎలా విశ్లేషించాలి? ఎవరికీ తెలియదు. అసలు ఈ కంపెనీలు, ఈ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? అందుకే నేను ఆర్థిక వ్యవస్థ గురించి అడిగాను. రానున్న ఐదేండ్లలో ఆర్థిక పరిస్థితి ఎలా ఉండబోతున్నది? దీనికి మన దగ్గర ప్రస్తుతానికి సమాధానం లేదు. అసలు మనం ప్రజలకు దేని కోసం శిక్షణ ఇవ్వాలి? మన చర్చ మొదలు పెట్టినప్పుడు నేను అడిగిన ప్రశ్న అదే కదా. సరైన ప్రాంప్టింగ్ కోసమా? అసలు సరైన ప్రాంప్టింగ్ అంటే ఏమిటి? ఒక సమాజంగా, మానవులుగా మన లక్ష్యం ఏంది అని ఆలోచిస్తే.. మనం ఎటువైపు వెళ్తున్నామో, అసలు మనం పరిష్కరించాల్సిన సమస్య ఏమిటో నాకు స్పష్టంగా తెలియడంలేదు.

చారిత్రకంగా చూస్తే, విశ్వవిద్యాలయాలు ఎలా రూపుదిద్దుకున్నాయో మీకు తెలుసు కదా! సోక్రటీస్ వంటి వారు తమ చుట్టూ కొందరు తెలిపైన వారిని చేర్చుకుని, రకరకాల విషయాలపై చర్చించేవారు. మనం ఇప్పుడు చేస్తున్నది కూడా సరిగ్గా అదే కదా. నిజంగా నేర్చుకునే విధానం ఇలాగే విషయాలపై చర్చ ద్వారా ఉండాలని నా అభిప్రాయం. కేవలం ఐదుగురు సభ్యులను మాత్రమే ఒక కోర్సులో చేర్చుకుని, ఒక బృందంగా కలిసి పని చేసి, తదుపరి బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని నిర్మించే పద్ధతిని అనుసరించవచ్చు కదా. ఒకవేళ ఆ కోర్సులో 100 మంది నమోదైతే అప్పుడు పరిస్థితి ఏంది? అన్ని రకాల నైపుణ్యాలు కలిగిన ప్రజలు ఉన్న దేశంలో మనం ఏం చేస్తాం? బహుశా గిట్‌హబ్‌లో మీరు రూపొందించిన ప్రాజెక్టుకు ఎన్ని స్టార్స్ వచ్చాయనే దాని ఆధారంగా మీకు గ్రేడ్ ఇస్తామని వారికి చెప్పవచ్చు. ఇటీవల ఒక స్కూల్‌లో టీచర్స్ డే ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆ కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే వెళ్లాను. అక్కడ అటెండెన్స్ అనే సిస్టమ్ తీసేస్తే, ఎంతమంది స్టూడెంట్స్ స్కూల్‌కు వస్తారు? అని నిర్వాహకులను నేనొక ప్రశ్న అడిగాను. వాళ్లు షాక్ అయ్యారు. నేను హైస్కూల్‌కు వెళుతున్నప్పుడు జైలుకు వెళ్తున్నట్టు ఫీలయ్యేవాడిని. ఆ పరిస్థితిని చాలా ద్వేషించేవాడిని. మీలో కూడా చాలామందికి ఇలాంటి అనుభవమే ఉండి ఉంటుంది. మనం సంతోషం లేని ప్రదేశాలను ఎందుకు సృష్టిస్తున్నాం. విద్యార్థులు వికాసదశలో ఉన్నప్పుడు స్కూల్‌కు వెళ్లి 8 గంటలు గడిపి, బాధాకరమైన మనస్సుతో తిరిగి ఇంటికి రావడం చూస్తున్నాం. ఇక అలాంటి పరిస్థితినే యూనివర్సిటీలో కూడా చూస్తే మనం ఏదో తప్పు చేస్తున్నట్టే కదా! ఇక్కడ మీకొక చిన్న కథ చెప్తాను. అది బిచ్చి అనే కన్నడ రచయిత రాశారు. నాలుగైదేండ్ల పిల్లవాడు, తన తల్లితో నడుస్తూ వెళ్తున్నాడు. ఓ గొర్రెను బలి ఇచ్చేందుకు లాక్కెళ్తుండటాన్ని చూశాడు.

వేసి ఉన్నాయి, దాన్ని బాజాభజంత్రీలు వాయిస్తూ తీసుకెళ్తున్నారు. ఆ పిల్లవాడు ఆసక్తితో అతడిని తల్లిని ఇలా అడిగాడు. 'ఆ గొర్రెను ఎక్కడికి తీసుకెళ్తున్నారు?' అని. ఆ తల్లి చాలా విషాదకరమైన మొహంపెట్టి, 'ఆ గొర్రెను బలి ఇచ్చేందుకు తీసుకెళ్తున్నారు' అని చెప్పింది. అప్పుడు ఆ పిల్లవాడు ఏమన్నాడంటే 'అవునా.. అంతేనా.. నేనింకా ఆ గొర్రెను స్కూల్‌కు తీసుకెళ్తున్నారు అనుకున్నాను' అని సమాధానం చెప్పాడు. అంటే బలి ఇవ్వడం కంటే స్కూల్‌కు తీసుకెళ్లడం దారుణం అని ఆ పిల్లవాడి భావన. నేను కూడా స్కూల్‌కు వెళ్లడానికి ఇష్టపడేవాడిని కాదు. హైట్ ఉండటం వల్ల వెనుకబెంచీలో కూర్చునేవాడిని. ఫిలాసఫీ పుస్తకాలు చదువుకునేవాడిని. క్లాస్ రూమ్ పాఠాలు బోర్ కొట్టేవి. వంద మందిని కూర్చోబెట్టి ఒక వ్యక్తి ప్రసంగించే తరహా వాతావరణాన్ని సృష్టించాం. అందుకే మిమ్మల్ని అడుగుతున్నాను. మీరు క్లాస్‌కు ఎందుకు వస్తున్నారు? అని. నా పదేండ్ల టీచింగ్ కెరియర్‌లో ఇలాంటి చర్చ ఎప్పుడూ చేయలేదు. ఇప్పుడు సమయం వచ్చిందనిపించి, చెప్పాను. ఇప్పుడు కూడా చెప్పకపోతే మనల్ని మనం మోసం చేసుకున్నట్టు అవుతుంది కదా!

సహజీవన రాగం సాధ్యమా?

ఆర్థిక రంగం మొదలు కృత్రిమ మేధ (ఏఐ) వరకూ అన్నిటా పరస్పరం హోరాహోరీ తలపడుతున్న బలమైన ప్రత్యర్థులు అమెరికా, చైనాలు నాలుగు నెలల వ్యవధిలో రెండోసారి కరచాలనం చేసుకున్నాయి. మొన్న మేలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ చైనాలో పర్యటించగా... మూడు రోజుల దౌత్య పర్యటన కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం వాషింగ్టన్ వచ్చారు. ఆయనకు రెండురోజులూ ఘనసత్కారాలే దక్కాయి. కెమెరాల ఎదుట అధినేతలిద్దరూ చిరునవ్వులు చిందించటం కూడా చూడముచ్చట గానే ఉంది. కానీ రెండు దేశాల మధ్యా ఉన్న సమస్యలు గానీ,వాటి కారణంగా ఇప్పటికే పేరుకు పోయిన విభేదాలు గానీ చిన్నవేం కాదు. అవి సంక్లిష్టమైనవి, సామరస్య పరిష్కారానికి ఓపట్టాన లొంగనివి. 60వ దశకంలో నాటి రష్యా అధినేత నికితా కృశ్చేవ్ ప్రతిపాదించిన 'మూడు శాంతుల' ప్రతిపాదనలో ఒకటైన 'శాంతియుత సహజీవనం' సూత్రాన్ని గుర్తుకు తెచ్చేలా సంఘర్షణకన్నా సహకారమే ఇద్దరికీ లాభదాయకమని షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అప్పట్లో కృశ్చేవ్‌కు రానట్టే జిన్‌పింగ్‌కు కూడా ట్రంప్‌నుంచి అనుకూల స్పందనేమీ రాలేదు. కానీ ఇరుపక్షాలూమరింత సమతూక వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవటానికి కలిసి పనిచేస్తున్నాయని ట్రంప్ అన్నారు. ఎగుమతులు పెంచటానికీ, ఆర్థికాభివృద్ధి సాధించటానికీ చైనా ప్రభుత్వం అక్కడి తయారీ రంగ పరిశ్రమలకు భారీయెత్తున సబ్సిడీలిస్తోంది. దాంతో చవగ్గా కార్లు, సౌరశక్తి ప్యానెళ్లు, ఖనిజాలు, ఉక్కు, ఇతర రకాల సరుకులు పాశ్చాత్య మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఈ వ్యూహం అమెరికానూ, పాశ్చాత్య దేశాలనూ తీవ్రంగా దెబ్బ తీస్తోంది. దీన్ని తగ్గించేందుకు తొలి ఏలుబడిలో ట్రంప్ చేసిన ప్రయత్నాలు కొంత వరకూ ఫలితాన్నిచ్చాయి. నిరుడు దీన్ని మరింత నియంత్రించేందుకు 25 శాతం అదనపు సుంకాలు విధించారు. వాటి కారణంగా సరుకుల వరద తగ్గిన మాట వాస్తవమే అయినా, దాదాపు 40 పాశ్చాత్య దేశాల మీదుగా ఆ వస్తువులు వెల్లువెత్తటం ట్రంప్‌కు తలనొప్పిగా మారింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగానే చైనా ఇదంతా చేస్తోంది. ఎవరెంతగా మొత్తుకుంటున్నా విదేశాలతో నిరుడు చైనా వాణిజ్య మిగులు లక్ష కోట్ల డాలర్ల పైమాటే. ఈమధ్యే అమెరికా మాజీ ఆర్థికమంత్రి జానెట్ ఎలెన్ అంతంతమాత్రంగా ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం 'చైనా షాక్'తో మరింత కుంగటం ఖాయమని చేసిన హెచ్చరిక వర్తమాన స్థితికి అద్దం పడుతోంది. చైనా సరుకులపై వ్యామోహంతగ్గించుకోమంటూ జనానికి చేసే హితబోధలేమీ పనిచేయటం లేదు. 'మాగా' పేరు చెప్పి ఆవేశంతో ఊగిపోయేవారు సైతం ఈ విషయంలో ట్రంప్ మాటల్ని బేఖాతరు చేస్తున్నారు. దాంతో దిక్కుతోచని స్థితిలో చైనాపై గత నెలలో 12.5 శాతం అదనపు సుంకాలు విధించారు. కానీ వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుకోవాలన్న అవగాహన కుదిరాక గత నెలలో కొన్ని వస్తువులకు దీన్నుంచి మినహాయింపునిచ్చారు. నవంబర్‌తో ముగియాల్సిన ఆ వెసులుబాటును తాజాగా వచ్చే జనవరి 10 వరకూ పొడిగించారు. అమెరికాతో సంఘర్షణ ముదిరితే జరిగే పర్యవసానాలేమిటో చైనాకు తెలియంది కాదు. అందుకే అది ద్విముఖ వ్యూహం అనుసరిస్తోంది. సుంకాలవల్ల అమెరికాలో కోల్పోయే నష్టాన్ని యూరోప్ దేశాల్లో భర్తీచేసుకుంటోంది. అలాగే తమవల్ల నష్టపోయే దేశాల్లో పరిశ్రమలు స్థాపిస్తామని, పెట్టుబడులు పెడతామని ప్రతిపాదిస్తోంది. ఆ దేశాల్లో భారీయెత్తున ఉద్యోగావకాశాలొస్తాయని ఊరిస్తోంది. ఈ వంకనే ప్రపంచాన్ని మధ్యపెట్టి నిలువు దోపిడీచేసిన చరిత్రగల అమెరికా, యూరోప్ దేశాలు వీటిని అంత తేలిగ్గాఅంగీకరిస్తాయా? ఈ విషయమై చైనాతో ఈయూ వచ్చేనెలలో చర్చించబోతోంది. కానీ ఫలితం ఉంటుందన్న ఆశ మాత్రం లేదు. అమెరికా--చైనా ఘర్షణలు ముదిరితే బాగుండు నని అవి కోరుకుంటున్నాయి. ఆ మాటెలా వున్నా ట్రంప్, జిన్‌పింగ్‌లిద్దరూ చైనాలోనవంబర్‌లో జరిగే ఆసియా పసిఫిక్ ఎకనామిక్ ఫోరం, డిసెంబర్‌లో అమెరికాలో జరిగే జీ20 శిఖరాగ్ర సదస్సుల సందర్భంగా కలుసుకోబోతున్నారు. అప్పటికల్లా వాణిజ్య సమస్య ఉపశమించాలని రెండు దేశాలకూ కోరికైతే ఉంది. కానీ పరస్పర విరుద్ధ శక్తుల మధ్య అదంత సులభం కాదని చరిత్ర చెబుతోంది.

ఫారం-6లో చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఓటరు నమోదు ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేసిన మార్పుల వల్ల తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని, రాజ్యాంగ పద్ధతులను ఉల్లంఘించి ఫారం 6ను ఏకపక్షంగా మార్చారని విమర్శించింది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి, ఆయనను జవాబుదారీగా చేయాలని కోరింది. యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించి, ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

శుక్రవారం రాత్రి ఆలస్యంగా ఆందోళనకు గురైన ఎన్నికల సంఘం యువ ఓటర్ల కోసం ప్రత్యేక నమోదు శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. సోషల్ మీడియా ద్వారా ఓటర్ ప్రత్యేక నమోదు శిబిరాలకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించింది. కానీ స్వయంగా సీఈసీయే ఫారం- 6లో స్పష్టంగా చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేసి, యువ ఓటర్లను చేర్చడాన్ని దాదాపు అసాధ్యం చేశారు. దరఖాస్తుదారుడి తల్లిదండ్రులు లేదా తాతలు గత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా ఉన్నారా? లేదా? అనే వివరాలను కోరుతూ ఫారం-6లో ఒక కొత్త తప్పనిసరి విభాగాన్ని చేర్చారు. ఇది తొలిసారి ఓటు వేస్తున్న జెన్‌జీ ఓటర్లకు అడ్డంకిగా మారింది. ఈ మార్పు పూర్తిగా చట్టవిరుద్ధం- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

ఫారం-6ను దొంగచాటుగా మార్చారు

2026 జులై ప్రారంభంలో ఎలాంటి అధికారిక ప్రకటన



లేకుండా ఫారం-6ను దొంగచాటుగా మార్చారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఈసీ మొదటి ఉల్లంఘన అని పేర్కొన్నారు. 'ఉల్లంఘన 2: ఫారం- 6ను సవరించే అధికారం ఈసీఐకి లేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం- 1950 ప్రకారం ఈ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఇది ఎన్నికల సంఘం స్పష్టమైన అతిక్రమణ. ఉల్లంఘన 3: ఓటర్ల నమోదు నిబంధనలు- 1960 ప్రకారం ఎలాంటి సవరణ చేయకుండా ఫారం-6ను మార్చారు. పార్లమెంటుకు సరైన సమాచారం ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మాత్రమే అలా చేయగలదు. ఒక శాసనబద్ధమైన ఫారంను, కలవరపడిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ద్వయం ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా మార్చారు. సుప్రీంకోర్టు తక్షణమే సుమోటోగా కేసును స్వీకరించి, ఈ విషయానికి సీఈసీని జవాబుదారీగా చేయాలి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్లుగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారడం ద్వారా తన తప్పును సరిదిద్దుకోవచ్చు. ముఖ్యంగా భారత యువత అటువంటి చర్యను ఆమోదిస్తుంది' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

'జ్ఞానేశ్ కుమార్ చట్టాన్ని ఉల్లంఘించారు'

ూ×=కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 10 నెలల వ్యవధిలో కనీసం 14సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని ఇటీవలే ఓ ప్రముఖ పత్రిక తన నివేదికలో పేర్కొనడంపైనా జైరాం రమేశ్ స్పందించారు. యువ, తొలిసారి ఓటు వేసేవారు ఎలాంటి వేధింపులు లేకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకోగలిగేలా ఫారం-6కు సంబంధించిన చట్టవిరుద్ధమైన, అనధికారిక మార్పులను వెనక్కి తీసుకోవాలని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కోరారని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగ సంప్రదాయాలు, పద్ధతులను ఉల్లంఘించడమే కాకుండా పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కూడా ఉల్లంఘించారని మండిపడ్డారు. ఆయన పదవిలో కొనసాగడం భారత ప్రజలను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు.

జ్ఞానేశ్‌పై విపక్షాలు ఫైర్- బీజేపీ మద్దతు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాలు పట్టుపడుతుండగా, ఆయనకు బీజేపీ మద్దతుగా నిలిచింది. ఎన్నికల ఓటముల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలని ప్రతిపక్షాల ఆరోపణలను కొట్టిపారేసింది. ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించి ఉంటే కేరళ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు గెలిచి ఉండేవి కావని పేర్కొంది. మరోవైపు, కేంద్ర మంత్రి, ఎన్‌డీఏ మిత్రపక్ష పార్టీ ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నాయకుడైన చిరాగ్ పాసవాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు, ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ముఖ్యంగా సీఈసీ ఈ ఆరోపణలపై స్పందించాలని కోరారు.

హుగ్లీలో టెన్షన్ టెన్షన్
టీఎంసీ ఎమ్మెల్యే కారుపై కోడి గుడ్లు, రాళ్లతో దాడి

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ వర్గం నేతలకు వరుసగా చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. హుగ్లీ జిల్లాలో టీఎంసీ అగ్రనాయకురాలు మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యేందుకు సెరాంపుర్‌కు వెళ్తున్న టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ కారుపై మూక దాడి జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై నల్ల జెండాలు పట్టుకున్న కొందరు వ్యక్తులు రాళ్లు, కోడి గుడ్లు విసిరారు. టీఎంసీ, మమత బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దాడిలో కునాల్ ఘోష్ స్వల్పంగా గాయపడినట్లు తెలుస్తోంది.

ఇది జంగిల్ రాజ్ పాలన : కునాల్ ఘోష్

తనపై జరిగిన దాడిని కునాల్ ఘోష్ ఖండించారు. బీజేపీ పాలనను జంగిల్ రాజ్‌గా అభివర్ణించారు. బీజేపీ నాయకులు తన కారుపై రాళ్లు, కోడి గుడ్లుతో దాడి చేసి రహదారిని దిగ్బంధించారని ఆరోపించారు. తనపై దాడి జరిగిన సమయంలో అక్కడ పోలీసులు ఎవరూ లేరని చెప్పారు. తాను ఇప్పుడు కోల్‌కతాకు తిరిగి వెళ్తున్నానని అన్నారు. తనపై దాడి చేసినవారిపై ఫిర్యాదు చేయడానికి నేరుగా లాల్ బజార్ లేదా భవాని భవన్‌కు వెళ్తానని స్పష్టం చేశారు.

మిమ్మల్ని ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు

తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై జరిగిన దాడిపై బంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సెరాంపుర్‌లో జరగనున్న ర్యాలీకి హాజరు కాకుండా అడ్డుకునేందుకు తృణమూల్ కాంగ్రెస్‌లోని తమ వర్గానికి చెందిన నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీ కార్యకర్తలు సభాస్థలికి వెళ్లే మార్గాన్ని స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. తమ పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి వెళ్లేందుకు తనను అనుమతించడం లేదని అన్నారు. టీఎంసీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పోలీసులు, బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. కునాల్ ఘోష్ ప్రయాణిస్తున్న కారుపై బీజేపీ గుండాలు దాడి చేశారని మండిపడ్డారు.

"సెరాంపుర్ ర్యాలీ కోసం మేము 15 రోజుల ముందే కోర్టు అనుమతి తీసుకున్నాము. అయినా పోలీసులు నన్ను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వడం లేదు. బీజేపీకి చెందిన అరాచక శక్తులు రోడ్లను దిగ్బంధించాయి. పోలీసులు ఎక్కడా



కనిపించడం లేదు. పైగా వారు ఈ రోడ్లు దిగ్బంధించిన వారికి సహకరిస్తున్నారు. బీజేపీ నాయకుల దాడిలో టీఎంసీ నేత కునాల్ ఘోష్ కారు ధ్వంసమయ్యింది. ఆయనపై కూడా దాడి జరిగింది. మీరే చెప్పండి ఇది ప్రజాస్వామ్యానికి మంచి పరిణామమేనా? నిజంగానే మీకు (బీజేపీనుద్దేశించి) ప్రజల మద్దతు ఉంటే ప్రతిపక్షాన్ని ఎందుకు అణచివేస్తున్నారు? పోలీసులు తమ యూనిఫాం తీసేసి బీజేపీ జెండాను పట్టుకుంటే సరిపోతుంది. ఇలాంటి ఘటనలు ఆకృత్యాలు కిందికి వస్తాయి. ఇలాంటి ఆకృత్యాలు ఆఫ్రికా దేశాలలో కనిపిస్తాయి. బీజేపీ పాలిత ప్రాంతాలైన ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలో కూడా ఇలాంటి ఘటనలు జరగడం లేదు. నా సెరాంపుర్ ర్యాలీ కోర్టు అనుమతితోనే జరుగుతోంది. ఇది సజావుగా సాగేలా చూడటం పోలీసులు, అధికారుల బాధ్యత. కానీ పోలీసులు అసలేం పట్టించుకోవడం లేదు"

సువేందుకు కల్యాణ్ బెనర్జీ ఫైర్

మరోవైపు, టీఎంసీ సీనియర్ నేత కల్యాణ్ బెనర్జీ సైతం బీజేపీపై మండిపడ్డారు. గత రెండు మూడు రాత్రులుగా సెరాంపుర్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు ఇంటింటికీ వెళ్లి మమత ర్యాలీకి హాజరైతే అరెస్టు చేస్తామని ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. శనివారం ఉదయం కూడా రిష్రాలోని 5, 6వ వార్డులలో మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు బయటకు వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారని అన్నారు. పోలీసు అధికారాలను అత్యంత చురుకుగా దుర్వినియోగం చేస్తున్న వ్యక్తి సెరాంపుర్ ఇన్‌స్పెక్టరేనని విమర్శించారు. సువేందు అధికారి అతన్ని ఎంతకాలం కాపాడగలరో తాను చూస్తానని, ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సువేందు అధికారి బీజేపీ అంటేనే గూండాయిజం, అరాచకం, పోలీసులను ఇంటి పనివాళ్లగా వాడుకోవడమని నిరూపించారని ఎద్దేవా చేశారు. మరోవైపు, ఇది సామాన్య ప్రజల నిరసన కాదని, బీజేపీ ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని టీఎంసీ నేత అసిత్ మజుందార్ ఆరోపించారు.

బీజేపీ ఏమందంటే?

మరోవైపు, టీఎంసీ సీనియర్ నేత, ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై జరిగిన దాడిపై బంగాల్‌లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ స్పందించింది. ఈ ఘటనను ప్రజల నుంచి వచ్చిన స్వచ్ఛంద స్పందనగా అభివర్ణించింది. ఈ మేరకు ఉత్తరపారా బీజేపీ ఎమ్మెల్యే దీపాంజన్ చక్రవర్తి వ్యాఖ్యానించారు.

సెప్టెంబర్ 30న ఇండి కూటమి పార్టీల కీలక భేటీ!

కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్యే అభిప్రాయ భేదాలు ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు రావడం, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ విధానంపై ప్రతిపక్షాల ఆందోళనల నడుమ ఇప్పుడు ప్రతిపక్ష ఇండి కూటమి కీలక సమావేశానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న దిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలు, సర్ ప్రక్రియపై తమ తదుపరి కార్యాచరణ, సీఈసీని తొలగించాలన్న డిమాండ్‌పై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాల్ని ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. ఇక దానికి ముందుగానే సెప్టెంబర్ 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై తమ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేయనుంది. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ఈ అంశంపై పరస్పరం సంప్రదింపులు జరుపుతున్నాయి. ఇప్పటికే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశాల్ని పరిశీలిస్తున్నాయి. దీనిపై చర్చలు జరుపుతూ, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటుండగా 1-2 వారాల్లో పార్లమెంట్ ఉభయ సభల్లో (రాజ్యసభ, లోక్‌సభలో) ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. అంతకుముందు ఈ ఏడాదిలోనే రెండు సార్లు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రతిపక్షాలు ఇలాంటి నోటీసుల్ని ప్రవేశపెట్టగా అప్పుడు తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పుడు మూడో ప్రయత్నంగా మరోసారి అదే చేయాలని చూస్తున్నాయి.

సెప్టెంబర్ 29న సీడబ్ల్యూసీ భేటీ

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ కూడా ఈ అంశంపై తన వ్యూహాన్ని ఖరారు చేసేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 29న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఇక్కడ కూడా సీఈసీ, ూ×= వివాదంపై పార్టీ తదుపరి కార్యాచరణను ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 25న కాంగ్రెస్ పార్టీ- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా నిరసనలు కూడా నిర్వహించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 30న దిల్లీలో ఇండి కూటమి సమావేశం ఉండొచ్చని సీపీఐ లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వెల్లడించారు. ఈ చర్చలు ఇండి కూటమికి మాత్రమే పరిమితం కాకుండా, ఇతర ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ ప్రతినిధులు, మేధావి వర్గం, సంబంధిత పౌరులను కూడా భాగస్వామ్యం చేయాలని ఆయన కోరారు. 'ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు బయటపడిన తర్వాత సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఆ పదవిలో కొనసాగే నైతిక అర్హత ఏ మాత్రం లేదు. ఓటర్ల హక్కుల్ని కాలరాస్తున్న సర్ ప్రక్రియను నిలిపివేసి, ఆయన రాజీనామా చేయాల్సిందే' అని ఆయన డిమాండ్ చేశారు. వామపక్షాలు సహా మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు సీఈసీని తొలగించాలని, ూ×= ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్, సీపీఐ (ఎం) మధ్య బంగాల్‌లో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం అంశంలో మాత్రం సమన్వయం కోసం సంప్రదింపులు జరుగుతున్నాయి.

వివాదానికి కారణమైన 14 అభ్యంతరాల రిపోర్ట్

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ఒక రిపోర్ట్ ఈ తాజా రాజకీయ పరిణామాలకు కేంద్రంగా నిలిచింది. దాని ప్రకారం ఎన్నికల సంఘం కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల కాలంలో 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం నిర్ణయాలు సహా ూ×= ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

'సర్' నోటీసులు..
అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

ఢిల్లీ: సర్ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. అంతర్గత విబేధాలు బయటపడిన తర్వాత తొలిసారి జరిగిన భేటీకి సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఈసీలు సందు, జోషి హాజరయ్యారు. 'సర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. 'సర్'లో అభ్యంతరాలపై నవంబర్ 30 వరకు గడువు పొడిగించింది. నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదని.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారని ఈసీ తెలిపింది. ఎస్ఐఆర్‌లో నోటీసు వచ్చిన వారికి బీఎల్‌వోలు ఇంటికి వచ్చి డాక్యుమెంట్లు తీసుకొని ఈసీఐనెట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. అసాధారణ పరిస్థితుల్లోనే ఆన్‌లైన్ హియరింగ్. కుటుంబ సభ్యుడు కూడా హాజరు కావచ్చు. రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి" అని సీఈసీ పేర్కొన్నారు. "ఎస్ఐఆర్ ఫామ్-6 డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి. ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది. కొత్త ఐటీ మాడ్యూళ్లు కమిటీ ఆఫ్ ఆఫీసర్స్ ద్వారా ఆమోదం తీసుకోవాలి. ఢిల్లీ క్లెయిమ్స్, అబ్జెక్షన్లు 30 అక్టోబర్ 2026 వరకు, డిస్పోజల్ 30 నవంబర్ 2026 వరకు పొడిగింపు. మహారాష్ట్రలో క్లెయిమ్స్ 12 అక్టోబర్ 2026 వరకు, డిస్పోజల్ 10 నవంబర్ 2026 వరకు పొడిగిస్తున్నాం" అని సీఈసీ తెలిపారు. ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది. ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని సీఈవోలకు ఈసీ ఆదేశించింది. కమిషన్ సమావేశాలకు ముందుగా అజెండా, తర్వాత మినిట్స్ జారీ చేయాలి. అధికారుల ఏపీఏఆర్‌లు ప్రతి సంవత్సరం డిసెంబర్ 31లోపు పూర్తి చేయాలి. విదేశీ పర్యటనలకు కమిషన్ అనుమతి తప్పనిసరి" అని సీఈసీ స్పష్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీల గళానికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర మంత్రి, ఎన్డీఏ మిత్రపక్ష నేత జితన్ రామ్ మాంజీ ఒక లేఖ రాశారు. పార్లమెంట్‌లో అత్యంత కీలకమైన బిల్లులపై చర్చ జరిగే తరుణంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలకు సభలో మాట్లాడేందుకు మరికొంత అదనపు సమయం కేటాయించాలని ఆయన ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో నిర్వహించిన ఒక సమావేశంలో ఈ ప్రధానాంశం చర్చకు వచ్చినట్లు మాంజీ వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ ప్రస్తావన తెచ్చారని తెలిపారు. తమ సామాజిక వర్గానికి చెందిన ప్రత్యేక సమస్యలు, అంశాలను సభలో వివరంగా ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంత సమయం అవసరమని పటేల్ కోరినట్లు మాంజీ తన లేఖలో ప్రస్తావించారు. ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ చేసిన ఈ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పీకర్‌ను కోరారు. మరోవైపు, సభలో తమకు అసలు సమయమే కేటాయించడం లేదని తాము అనడం లేదని.. తమ వర్గాల సమస్యలపై మరింత లోతుగా చర్చించేందుకు కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని మాత్రమే కోరుతున్నట్లు ఎంపీ పటేల్ గతంలో ఒక మీడియాతో మాట్లాడుతూ స్పష్టం చేశారు.

నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం



నాగాలాండ్‌లో కల్తీ మద్యం అనుమానిత ఘటనలు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల్లో మద్యం సేవించిన తర్వాత 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మొకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఐ.బంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? దాని సరఫరా వెనుక ఎవరున్నారు? అనే అంశాలను సిట్ దర్యాప్తు చేస్తోంది. మద్యం నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం గువాహటికి పంపించారు. మరణాలకు అసలు కారణం ఏంటో పరీక్షల తర్వాత స్పష్టమవుతుందని పోలీసులు తెలిపారు. కొన్ని ఆధారాలు లభించాయని, అయితే దర్యాప్తు ప్రారంభ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని సీనియర్ ఎస్పీ వెసుప్రా కెజో తెలిపారు. మరణాల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 19 మందిని అరెస్టు చేశారు. దాదాపు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని, లేబుల్ లేని లేదా అనుమానిత అక్రమ మద్యాన్ని తాగవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. మద్యం తాగిన తర్వాత తల తిరగడం, చూపు మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు. నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధ చట్టం అమల్లో ఉంది.

'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైజ్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

సచివాలయ ఉద్యోగుల ధర్నా, ర్యాలీలకు అనుమతి లేదు



విజయవాడ క్రైమ్, మహానగర్

శాంతిభద్రతల పరిరక్షణ నేపథ్యంలో ఈ నెల 27న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నిర్వహించదలిచిన ధర్నా, ర్యాలీలు, ఇతర నిరసన కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించినట్లు పశ్చిమ జోన్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయి పిలుపులో భాగంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ధర్నా, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు సచివాలయ ఉద్యోగులు అనుమతులు కోరినట్లు పేర్కొంది. అయితే నగరంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉండటంతోపాటు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వరద ముంపు సవాళ్లు, వినాయక నిమజ్జన కార్యక్రమాలు, ఊరేగింపులు, ట్రాఫిక్ అంతరాయాలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి విధుల్లో పోలీసు సిబ్బంది నిమగ్నమై ఉన్నారని తెలిపింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజా సౌకర్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ధర్నాకు అనుమతి నిరాకరించినట్లు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న సచివాలయ సిబ్బంది ప్రస్తుత అత్యవసర పరిస్థితులను అర్థం చేసుకుని పోలీసు శాఖకు సహకరించాలని కోరింది. అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు లేదా చట్టవిరుద్ధంగా కూడళ్ల వద్ద సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ధర్నా ముసుగులో అసాంఘిక శక్తులు ప్రవేశించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉన్నందున నిరసన కార్యక్రమాన్ని విరమించుకుని పోలీసులకు సహకరించాలని సూచించింది.

ఆమని చెరువు ఆయకట్టు రైతుల సమస్యలపై కలెక్టర్ పరిశీలన



ఆగిరిపల్లి, మహానగర్

మండల పరిధిలోని సగ్గూరులో ఆమని చెరువు ఆయకట్టు రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శనివారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమని చెరువు నీటిని తమ ప్రాంతంలోని పొలాలకు సాగునీరు అందించేందుకు ఇతర ప్రాంతాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని సగ్గూరుకు చెందిన పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ సమస్యను పరిశీలించి సాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, కృష్ణా జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ గునకరరావు, ఈఈ కె. బాబు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి. రాజ్‌కుమార్, తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ సలామ్, ఇరిగేషన్ ఏఈ జి. వెంకటేష్, రెవెన్యూ, వ్యవసాయ, ఇరిగేషన్, పోలీసు అధికారులు, స్థానిక రైతు నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



విజయవాడ, మహానగర్

ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సుజనా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై దరఖాస్తు చేసుకున్నారు. జాబ్ మేళాలో 23 కంపెనీలు తమ ప్రతినిధులతో పాల్గొనగా, 310 మంది నిరుద్యోగులు హాజరై ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, ఆసక్తికి అనుగుణంగా ఆయా కంపెనీల ప్రతినిధులు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ చెల్లా మధుభూషణరావు, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సిపాన శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి సంస్థ సీఆర్ఓ బొబ్బిలి కిరణ్, కేబీఎన్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధిలో ఏపీ చాంబర్స్ పాత్ర అభినందనీయం





జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి కేటాయింపునకు సహకరిస్తా
ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని పిలుపు

విజయవాడ

రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) అందిస్తున్న సేవలు, చురుకైన పాత్ర అభినందనీయమని స్థానిక ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఏపీ చాంబర్స్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ మురళి ఫార్చ్యూన్‌లో శనివారం నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన వాతావరణాన్ని బలోపేతం చేయడంలో ఏపీ చాంబర్స్ చేస్తున్న కృషి కీలకమన్నారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం, మౌలిక వసతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం, పరిశ్రమల రంగం పరస్పర సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపునకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, ఇందుకోసం సంబంధిత వర్గాలతో సమన్వయంతో ముందుకు సాగుతామని చెప్పారు. ఇటీవల 'ఐకానిక్ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్--2026' అవార్డు అందుకున్న తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ బోర్డు సభ్యుడు సీఎం మోహన్ శ్యాం ప్రసాద్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఏపీ చాంబర్స్‌కు అనుబంధంగా ఉన్న వివిధ సంఘాల అధ్యక్షులను కూడా సత్కరించారు. నగర అభివృద్ధి, పర్యాటక రంగానికి మరింత ప్రాచుర్యం కల్పించే దిశగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. వాణిజ్య, పారిశ్రామిక, సాంస్కృతిక, పర్యాటక రంగాలకు చెందిన అన్ని వర్గాలు ఉత్సవంలో చురుకుగా పాల్గొని తమ వంతు భాగస్వామ్యం అందించాలని కోరారు. విజయవాడ ఉత్సవ్‌ను నగరానికి చెందిన ప్రతి ఒక్కరి ఉత్సవంగా భావించి విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో రీజినల్ స్పిరిచువల్ టూరిజం డెవలప్‌మెంట్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించడంతో పాటు వాణిజ్య, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. విజయవాడకు ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను ప్రపంచానికి పరిచయం చేసే కార్యక్రమాల్లో పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి. రాజశేఖర్, జనరల్ సెక్రటరీ సుబ్బారావు, కోశాధికారి అక్కయ్య నాయుడు, బోర్డు సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు

ఈ నెల 30న పేదలకు పట్టాభిషేకం
బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్

విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి వివక్ష లేకుండా ఇళ్ల పట్టాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు. ఈ నెల 30న విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని భవానిపురం పున్నమి ఘాట్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. భవానిపురంలోని ఎన్డీయే కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో 'అందరికీ ఇళ్లు' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. తొలి విడతగా 24 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 6,699 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషితో దశాబ్దాలుగా కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. ఈ నెల 30న భవానిపురంలో నిర్వహించనున్న 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో కూటమి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అడ్డూరి శ్రీరామ్ పిలుపునిచ్చారు. పేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్, 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్న 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో పశ్చిమ మండల తహసీల్దార్ షేక్ ఇస్మాయిల్, మాజీ కార్పొరేటర్లు యేదుపాటి రామయ్య, గుడివాడ నరేంద్ర రాఘవ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం కన్వీనర్ పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ పార్టీలతో జగన్ములాఖత్

నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జాతీయ రాజకీయ వ్యూహంలో వస్తున్న మార్పులను స్పష్టంగా సూచిస్తున్నాయి. ఓడిపోయాక కూడా జగన్ రెడ్డి విధానాలను, శైలిని అత్యంత తీవ్రస్థాయిలో విమర్శిస్తూ వచ్చిన సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, అనూహ్యంగా నేరుగా తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. తమ పార్టీ నిర్వహించే సదస్సుకు హాజరు కావాలంటూ జగన్‌ను ఆయన ఆహ్వానించడం కేవలం ఒక సాధారణ మర్యాదపూర్వక భేటీ ఎంతమాత్రమూ కాదు.గతంలో సీపీఐ జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో కీలక సదస్సులు, చర్చా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ, వైఎస్సార్‌సీపీని , జగన్ రెడ్డిని ఏనాడూ భాగస్వామ్యంగా ఆహ్వానించిన దాఖలాలు లేవు. అలాంటిది ఇప్పుడు రాత్రికి రాత్రే సీపీఐ వైఖరిలో ఈ మార్పు రావడానికి వెనుక జాతీయ స్థాయి ఇండియా కూటమి అగ్రనేతల స్పష్టమైన సూచనలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే క్రమంలో, ఏపీలో వైఎస్సార్‌సీపీని మెల్లగా కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి వైపునకు తిప్పుకునేందుకు కమ్యూనిస్టులను దూతలుగా వాడుకుంటున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయి.మరోవైపు జగన్ రెడ్డి కూడా ఈ పరిణామాలను తన రాజకీయ రక్షణ కవచంగా, వ్యూహాత్మక ఆయుధంగా మలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలతో సఖ్యతగా ఉంటూ తనపై ఉన్న కేసులు, ఇతర అంశాల్లో లబ్ధి పొందిన జగన్, ఇప్పుడు రాష్ట్రంలో అధికారం కోల్పోయాక జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ దారులను వెతుక్కుంటున్నారు. కమ్యూనిస్టులతో వేదికలు పంచుకోవడం ద్వారా, అవసరమైతే తాము కాంగ్రెస్‌తో జతకట్టడానికి కూడా సిద్ధమేనన్న సంకేతాలను ఢిల్లీలోని బీజేపీ పెద్దలకు పంపుతూ ఒకరకమైన రాజకీయ బ్లాక్‌మెయిలింగ్ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. తమ కేసులు, వ్యవహారాల విషయంలో ఈడీ దూకుడును తగ్గించాలన్నది ఆయన ప్లాన్ కావొచ్చు. సీపీఐ నాయకులను సజ్జల రామకృష్ణారెడ్డి వెంటబెట్టుకుని స్వయంగా జగన్ వద్దకు తీసుకు వచ్చారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ ప్రభుత్వంపై వామపక్షాలు నిరంతరం పోరాటాలు చేయగా, మారిన రాజకీయ సమీకరణాలతో ఇప్పుడు అదే వామపక్ష నేతలను సజ్జల తాడేపల్లి గడప తొక్కించి అధినేతతో ముచ్చటించేలా చేయడం వెనుక ఏదో ఒక ప్రతిపక్ష ఐక్యత వ్యూహం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇక ఆహ్వానం వరకు బాగానే ఉన్నా.. విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ భేటీకి జగన్ స్వయంగా హాజరయ్యే అవకాశాలు లేవు. ఉమ్మడి వేదికలపైకి రావడం గానీ, ఇతర పార్టీలు నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాలకు స్వయంగా వెళ్లి కూర్చోవడం గానీ జగన్ రాజకీయ శైలిలో ఎన్నడూ కనిపించని వ్యవహారం. సీపీఐ నిర్వహించే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి వైఎస్సార్‌సీపీ తరపున ఒక అధికారిక ప్రతినిధి బృందాన్ని పంపిస్తారా అన్నది కూడా క్లారిటీ లేదు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రజా సమస్యలపై అందరితో కలిసి పనిచేయడానికి సానుకూలత వ్యక్తం చేసిన జగన్.. ఏదైనా ఉంటే తమ పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనాలి కానీ.. తాము వేరే వారి కార్యక్రమాల్లో పాల్గొనడం ఏమిటని అనుకుంటారు.జగన్ రెడ్డి అనుసరిస్తున్న ఈ రాజకీయ విధానం అత్యంత ప్రమాదకరమైన మలుపులకు దారితీసే అవకాశం ఉంది.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి

లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్లకు ఉచిత వైద్య శిబిరం





పరవాడ

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల వ్యక్తిగతంగా అవగాహన పెంచుకోవాలని, ఎముకలు, కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని లీ ఫౌండేషన్ ట్రస్టీ ఆళ్ళ లీలారాణి సూచించారు. లీ ఫౌండేషన్, వెసూవియస్ సంస్థతో కలిసి ఉద్యోగుల కోసం శనివారం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో మొత్తం 140 మంది ఉద్యోగులు వైద్య సేవలు పొందారు. శిబిరంలో శారీరక కొలతలు, నడుము-హిప్ నిష్పత్తి, హిమోగ్లోబిన్, రాండమ్ బ్లడ్ షుగర్, రక్తపోటు, శరీర మూలకాల పరిమాణం, ఎముకల ఖనిజ సాంద్రత తదితర పరీక్షలు నిర్వహించారు. వైద్యులు, ఆహార నిపుణులు, యోగా థెరపిస్టులు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవన విధానంలో చాలామంది ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ఉద్యోగులు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు జయలక్ష్మి, సరోజిని, డాక్టర్ రాధిక, న్యూట్రిషనిస్ట్ మాధురి, క్రాంతి, అనుష, యోగా థెరపిస్ట్ అఖిల్ సూర్య తేజ, జీఎన్ఎం భాగ్యలత, వెసూవియస్ హెచ్ఆర్ కావ్యతో పాటు వెసూవియస్ యాజమాన్య బృందం, తదితరులు పాల్గొన్నారు.

పల్లెసీమల గురించి ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్

మోపిదేవి, మహానగర్



పల్లెసీమల గురించి ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో పల్లె పండుగ-3.0 కార్యక్రమం ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా వీబీజీ-రాంజీ నిధుల నుంచి మోపిదేవి మండలంలో టేకుపల్లి నుంచి అయోధ్య వయా మేళ్లమర్రు మధ్య నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.2.09 కోట్లు, రజాపురం నుంచి కుమ్మరిపాలెం వరకు 950 మీటర్ల రోడ్డు నిర్మాణానికి తారు రోడ్డు నిర్మాణానికి రూ.57 లక్షలు, పెదకళ్లేపల్లి-కుమ్మరిపాలెం వయా రజాపురం, అడపావారిపాలెం మధ్య 1.500 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.73 లక్షలు నిధులు మంజూరు చేసిన సందర్భంగా ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. శనివారం మోపిదేవి మండలంలోని టేకుపల్లి, మేళ్లమర్రు, పెదకళ్లేపల్లి, అయోధ్య, కుమ్మరిపాలెం, అడపావారిపాలెం గ్రామాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకాలు ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ నాయకులు, గ్రామస్థులు, మహిళలు వందనాది మంది తరలివచ్చి ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో సందడిగా పాల్గొన్నారు. గ్రామ గ్రామాన కోలాహలంగా జరిగిన పాలాభిషేక కార్యక్రమాల్లో పాల్గొని సామాన్య మహిళలు తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా తాము ఎదుర్కొంటున్న ప్రధాన రహదారి సమస్యలను పరిష్కరిస్తూ నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ కు ధన్యవాదములు తెలిపారు. జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అడపావారిపాలెంలో జరిగిన సభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రహదారుల మంజూరు తో ప్రజల కళ్ళల్లో కనిపించిన సంతోషం సంతృప్తిని ఇచ్చిందన్నారు. గ్రామ స్వరాజ్యం సాకారం కావాలని పల్లెలు స్వయం సమృద్ధి సాధించి స్వయం పోషకాలు కావాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖను చేపట్టారన్నారు. గత కొన్నేళ్లుగా పాలకులు నగరాలపై శ్రద్ధ చూపడంతో పల్లెలు ఖాళీ అయిపోయి గ్రామాల్లో కేవలం వృద్ధులు మిగిలే పరిస్థితి నెలకొందన్నారు. ప్రకృతి ఒడిలో స్వచ్ఛమైన వాతావరణంలో ప్రశాంత జీవనం సాగిస్తున్న ప్రజలు మౌలిక సౌకర్యాలు కొరవడి, రానురాను పల్లెలు ఖాళీ అయిపోయే పరిస్థితిని గమనించిన గర్వించదగ్గ నాయకుడు పవన్ కళ్యాణ్ అని తెలిపారు. ఆయన ప్రత్యేక శ్రద్ధతోనే కేంద్ర ప్రభుత్వం గ్రామీణ రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధి బాధ్యత విస్మరించడంతోపాటు, గత టిడిపి ప్రభుత్వంలో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులను వైసీపీ అధికారంలోకి రాగానే అర్ధాంతరంగా నిలిపి వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే మళ్ళీ ఆయా పనులు పునరుద్దరించే ప్రయత్నం చేసినప్పటికీ గత పాలకులు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల రహదారుల నిర్మాణానికి పల్లె పండుగ కార్యక్రమం వరంగా నిలిచిందన్నారు. వీబీజీ రాంజీ పథకం ద్వారా నియోజకవర్గానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.12 కోట్లు నిధులు మంజూరు చేయడంతో కీలక రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పెద్దకళ్లేపల్లి చుట్టూ ఉన్న గ్రామాల రహదారులను నిర్మాణం చేయవలసిన ఆవశ్యకతను, ఇక్కడి విభిన్న పరిస్థితిని, గ్రామస్తుల అవసరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారంతో రోడ్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. పల్లెసీమల గురించి ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్ అని, వారి సహకారంతో మంజూరైన ఈ రహదారుల నిర్మాణ పనులకు అతి త్వరలో శంకుస్థాపన చేసి త్వరితగతిన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. భారీ వాహనాలు, దమ్ము చక్రాల రాకపోకలు నియంత్రించి గ్రామస్తులు నిర్మించబోయే నూతన రహదారులను పది కాలాలపాటు రక్షించుకోవాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణాతి దారుణంగా ఉన్నప్పటికీ చంద్రబాబు తన అనుభవంతో పరిపాలన సాగిస్తున్నారని, వినేపద్యంలో రహదారుల నిర్మాణానికి మానవతావాది పవన్ కళ్యాణ్ బాధ్యతగల హృదయంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి బాధాతప్త హృదయుల కన్నీళ్లు తుడిచి గ్రామాలకు వెలుగులు అందిస్తున్నారన్నారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన రహదారుల నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు గ్రామస్తుల తరపున ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మోపిదేవి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, మాజీ సర్పంచ్ అరజా సంధ్యారాణి, పార్టీ నాయకులు అడపా రాంబాబు, కూరేటి సురేష్, మాజీ ఎంపీటీసీ అరజా ఆషాదేవి, సొసైటీ చైర్మన్లు అరజా రాధిక, యర్రంశెట్టి సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ మెరకనపల్లి నరేష్, పెదకళ్లేపల్లి గ్రామ అధ్యక్షులు కేతరాజు శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు అరజా కిరణ్ కాంత్, గోళ్ళ శ్రీనివాసరావు, బాదర్ల లోలాక్షు నాయుడు, యడ్లపల్లి లక్ష్మణరావు (బుజ్జి), కోసూరు శివాజీ, తోట కృష్ణాంజనేయులు, చోడగం నానీ, కూరేటి రాఘవ, కూరేటి జగన్, గోళ్ళ వెంకటేశ్వరరావు, గోళ్ళ రామారావు, గుమ్మడి నరసింహారావు, అరజా ఏడుకొండలు, యర్రంశెట్టి హరీష్, మేడిశెట్టి పవన్, యర్రంశెట్టి సునీల్, చవాకుల సురేష్, కేతరాజు రామకృష్ణ, బాచు శ్రీనివాసరావు, మత్తి వంశీకృష్ణ, యక్కటి రామాంజనేయులు, కోసూరు మల్లి, కోసూరు రామాంజనేయులు, అడపా చోటే, ఆళ్ళ నాంచారయ్య, అడపా రవి, అరజా ఏడుకొండలు, గరికపాటి చిట్టియ్య, హరిప్రసాద్, బాదర్ల సాయి, బాదర్ల నవీన్, బాదర్ల నాగేశ్వరరావు, బాదర్ల రంగారావు, అరజా నరసింహారావు, అరజా కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు సమాన అవకాశాలు కల్పించేలా చర్యలు

జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

రూ.50 వేల విలువైన టచ్‌ఫోన్లు, వినికిడి యంత్రాల పంపిణీ

విజయవాడ, మహానగర్



బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. ప్రపంచ బధిరుల దినోత్సవం, సంజ్ఞల భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా వికాస సంస్థ, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ బధిరులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో ఎటువంటి సంకోచం చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి అవసరాలు, సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు తాము అందుబాటులో ఉంటామని తెలిపారు. బధిరులు సమాజంలో సమాన అవకాశాలతో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయాన్ని అందించడంతోపాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ జిల్లా స్థాయి కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని వివిధ బధిరుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, డెఫ్ ఎనేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది బధిరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా బధిరుల ప్రతిభను ప్రోత్సహించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇద్దరు బధిరులకు టచ్‌ఫోన్లు, ఐదుగురికి వినికిడి యంత్రాలు కలిపి మొత్తం రూ.50 వేల విలువైన ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వికాస సంస్థ ప్రతినిధులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రేవు కామరాజు, జిల్లా అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రతినిధులు, పాఠశాలల సిబ్బంది, బధిరుల సంఘాల ప్రతినిధులు, ఇన్సైట్ ఇండియా సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బధిరుల సంక్షేమం, వారి హక్కులు, వారికి అవసరమైన సహాయ సహకారాలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు.

ఈ నెల 28, 29, 30 తేదీల్లో జాబ్‌మేళాలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. 28వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు నందిగామ నియోజకవర్గంలోని ఏపీ ఎన్జీవోస్ బిల్డింగ్, గాంధీ సెంటర్‌లో, సెప్టెంబర్ 29న మంగళవారం ఉదయం 9 గంటలకు మైలవరం నియోజకవర్గంలోని డా. జకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజీ, ఇబ్రహింపట్నంలో, 30న బుధవారం ఉదయం 9 గంటలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఎస్ఏవీ అండ్ ఎన్వీజేఆర్ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి జాబ్‌మేళాకు సుమారు 10 ప్రముఖ కంపెనీలు హాజరై వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఉద్యోగాలకు అర్హులని కలెక్టర్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే సమయంలో రెస్యూమ్ లేదా బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని తెలిపారు. నందిగామ జాబ్‌మేళా వివరాలకు 8919951682, 72072 08075, ఇబ్రహింపట్నం జాబ్‌మేళాకు 95027757755, 80083 76100, జగ్గయ్యపేట జాబ్‌మేళాకు 9666815987, 96765 83213 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార బాలికల పోషణపై ప్రత్యేక అవగాహన

పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవాల ద్వారా పోషకాహారం, ఆరోగ్యంపై చైతన్యం

విజయవాడ, మహానగర్



పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని అధికారులు పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కౌమార బాలికల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడమే పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సేవలను పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి అక్టోబర్ 7 వరకు అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం విజయవాడలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మేరీస్టెల్లా కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమానికి డీఎంహెచ్‌వో డా. ఎ. శ్రవణ్‌బాబు, డీఈవో ఎల్. చంద్రకళ, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. కె. శాంతిశ్రీ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి రుక్సానా సుల్తానా బేగం మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే గర్భిణీలు సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. డీఎంహెచ్‌వో డా. ఎ. శ్రవణ్‌బాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య, పోషకాహార సేవలను సమర్థవంతంగా అందించాలని సూచించారు. డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ కౌమార బాలికలు పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే బాలికలు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి విద్యలో రాణించగలరని తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. కె. శాంతిశ్రీ పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తూ ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. వివిధ ఆహార పదార్థాల్లో లభించే విటమిన్లు, వాటి ప్రాధాన్యత, ఆరోగ్యంపై వాటి ప్రభావాన్ని వివరించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని గర్భిణీలకు సీమంత కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా సుదీర్ఘకాలంగా సేవలందించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లాలోని సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవా సంకల్ప అభయాన్ కార్యక్రమం

ఆగిరిపల్లి, మహానగర్



ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొద్దనపల్లి గ్రామంలోని హెల్త్ సెంటర్‌లో శనివారం సేవా సంకల్ప అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ నక్కనబోయిన వేణు హరిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు షుగర్, బీపీ తదితర అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్ సాయి సుధ మాట్లాడుతూ ప్రజలు అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉప్పు, చక్కెర, నూనెను తగిన మోతాదులో మాత్రమే తీసుకోవాలని, ప్రతిరోజూ సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో 151 మంది ఆరోగ్య, రక్త పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాత-నాన్నలా జేసన్ గొప్ప స్థాయికి వెళ్లాలి: చిరంజీవి



“ఈ మధ్య కంటెంట్ బాగున్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అది చిన్న సినిమానా? పెద్ద చిత్రమా? అని ఆలోచించడం లేదు. అదే కోవలో ‘సిగ్మా’ హిట్టవ్వాలని కోరు కుంటున్నా” అని చిరంజీవి అన్నారు. సందీప్ కిషన్ హీరోగా, ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘సిగ్మా’. జేసన్ సంజయ్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ తెలుగు--తమిళ భాషల్లో నిర్మించిన ఈ మూవీ అక్టోబరు 2న విడుదల కానుంది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ కోస్తాంధ్ర, తెలంగాణలో, సీడెడ్‌లో ఎన్‌వీఆర్ సినిమా రిలీజ్ చేస్తున్నాయి. శుక్రవారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ-- “జేసన్ సంజయ్‌ని చూస్తుంటే తన గ్రాండ్‌ఫాదర్ ఎస్.ఎ. చంద్రశేఖర్‌గారు గుర్తొస్తారు. నాతో ‘చట్టానికి కళ్ళులేవు, దేవాంతకుడు’ వంటి అద్భుతమైన సినిమాలు తీశారాయన. ఆయన మనవడు సంజయ్ ఓ సినిమాకి దర్శకత్వం వహించాడంటే సంతోషంగా ఉంది. విజయ్ నటించిన ఓ మూవీ ఓపెనింగ్‌కి నేను, రజనీకాంత్ వెళ్లి క్లాప్ కొట్టాం. ఆ కుటుంబం నుంచి వచ్చిన కుర్రాడు సిగ్మా’ ఈవెంట్‌కి అతిథిగా నన్ను పిలవడానికి వచ్చాడని హ్యాపీగా ఇక్కడికి రావడానికి ఒప్పుకున్నాను. ‘నువ్వు మీ నాన్నలా యాక్టర్ అవకుండా ఎందుకు డైరెక్షన్ ఎంచుకున్నావు?’ అని అడిగితే.. ‘నాకు ముందు నుంచి రైటింగ్, డైరెక్షన్ అంటే ఇష్టం’ అన్నాడు జేసన్. వాళ్ల తాత చంద్రశేఖర్ (డైరెక్టర్), నానమ్మ శోభ (రచయిత) జీన్స్‌ని పుణికి పుచ్చుకున్నాడు కాబట్టే ఈ రోజు డైరెక్షన్ చేయడానికి ముందుకొచ్చాడు. తాత చంద్రశేఖర్, నాన్న విజయ్ ఎంత గొప్ప స్థాయికి వెళ్లారో జేసన్ కూడా అంత ఉన్నతమైన స్థానానికి వెళ్లాలని కోరుకుంటున్నాను. సందీప్‌ని చూస్తుంటే నా యంగ్ డేస్ గుర్తొచ్చాయి. ఇండస్ట్రీకి కొత్త రక్తం వస్తే ఆ ఎనర్జీ వేరే ఉంటుంది. పాత తరం కూడా ఉండాలి.. లేదంటే నన్ను పొమ్మంటారు. అలాగే కొత్త తరం రావాలి.. కొత్త పుంతలు తొక్కాలి’ అని పేర్కొన్నారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ-- “సిగ్మా’ కథను తొలుత దుల్కర్ సల్మాన్‌గారికి చెప్పాడు జేసన్. ఆయన బిజీగా ఉండటంతో చేయలేకపోయారు. ఆ తర్వాత నాకు ఈ కథ చెప్పాడు జేసన్. చెప్పింది చెప్పినట్టుగా తీశాడు” అని చెప్పారు. జేసన్ సంజయ్ మాట్లాడుతూ--“సిగ్మా’ యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్. అన్ని వయసుల వారికి మా మూవీ నచ్చుతుంది. నా కథను నమ్మి సినిమా చేసిన సందీప్ బ్రోకి థ్యాంక్స్. ఫరియా కెరీర్‌లో ఇది మరచిపోలేని తమిళ చిత్రం అవుతుంది” అన్నారు. లైకా ప్రొడక్షన్స్ హెడ్ తమిళ్ కుమరన్, కెమెరామేన్ ఛోటా కె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధనుష్ ద్విభాషా చిత్రం



కోలీవుడ్ స్టార్స్ ధనుష్, సూర్యలతో సార్, విశ్వనాథ్ అండ్ సన్స్ వంటి బ్లాక్‌బస్టర్స్‌ని అందించిన సితార ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ.. మళ్లీ ధనుష్ హీరోగా ఓ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ధనుష్ కెరీర్‌లో 56వ సినిమాగా రానున్న ఈ చిత్రానికి విజయ్ బి.కుమార్ దర్శకత్వం వహించనున్నారు. కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రీతి ముకుందన్ కథానాయిక. సాయి అభ్యంకర్ సంగీతం సమకూరుస్తున్నారు. వచ్చే ఏడాది వేసవి కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటన విడుదల చేశారు.



గాంధీ జయంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు ‘ప్రేమనే ఊరిలో’!



కన్నడ నాట సంచలన విజయం సాధించిన ప్రతిష్టాత్మక చిత్రం ‘ప్రేమనే ఊరిలో’ ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను మైమరిపించడానికి సిద్ధమైంది. మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్ మరియు వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాతలు చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. మనోజ్ కుమార్ అత్యంత ఆసక్తికరమైన కథ, కథనాలతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీపై ఇండస్ట్రీలో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే సెప్టెంబర్ 25న కన్నడలో విడుదలైన ఈ చిత్రం అక్కడ బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడమే కాకుండా, థియేటర్లలో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో దూసుకుపోతోంది. కన్నడ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. భారతీయ సినీ రంగాన్ని షేక్ చేసిన ‘కేజీఎఫ్’, ‘కాంతార’ వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ సినిమాకు బలమైన సంభాషణలు రాయడం విశేషం. ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల రాసిన అద్భుతమైన పాటలకు సునద్ గౌతమ్ అందించిన స్వరాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే మార్కెట్లోకి విడుదలైన ఈ చిత్రంలోని పాటలు, టీజర్ మరియు ట్రైలర్‌కు సోషల్ మీడియాలో విశేషమైన స్పందన లభించింది. విజువల్స్ పరంగా సినిమాను అత్యంత సుందరంగా మలిచిన రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ వర్క్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది. కర్ణాటకలో సాధించిన ఘనవిజయం తరహాలోనే తెలుగు ప్రేక్షకులు కూడా ఈ ప్రేమకథా చిత్రాన్ని ఆదరిస్తారని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఓటీటీ హిట్.. ఆత్మరక్షణ అవసరం

నేటి సమాజంలో జరుగుతున్న కొన్ని దురదృష్టకర సంఘటనలు ఆడపిల్లల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అమ్మాయిని బయటికి పంపించడమంటే.. ప్రమాదంలోకి నెట్టడమేనని భావించేలా చేస్తున్నాయి. దాంతో, చాలావరకు వారితో ఎవరో ఒకరిని తోడుగా పంపించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలను నేర్పించాల్సిన అవసరాలను కూడా నొక్కి చెబుతున్నాయి. ఇదే పాయింట్ ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన చిత్రం ‘తుడక్కమ్’. అంటే.. ఆరంభం! మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ తనయ విస్మయ మోహన్‌లాల్ వెండితెరకు పరిచయమైన ఈ చిత్రం.. బాక్సాఫీస్ దగ్గర 40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా ‘జియో హాట్ స్టార్’ వేదికగా తెలుగులో స్ట్రీమింగ్‌కు వచ్చింది. మీనూ (విస్మయ మోహన్‌లాల్) అనే అమ్మాయి చుట్టూ తిరిగే సర్వైవల్ థ్రిల్లర్ కథ ఇది. ఆమె తండ్రి రవి బాల చంద్రన్ (సాయికుమార్) విలేజ్ ఆఫీసర్‌గా పనిచేస్తుంటాడు. అతని రెండు కాళ్లూ చచ్చుబడి పోవడం వల్ల, వీల్‌చైర్‌లో కూర్చునే విధులు నిర్వహిస్తుంటాడు. తల్లిలేని బిడ్డ కావడంతో మీనూను చాలా గారాబంగా పెంచుతాడు. వీళ్ల ఇల్లు ఊరికి దూరంగా ఉంటుంది. అక్కడికి దగ్గర్లో జోసెఫ్ మాస్టర్ ఇల్లు తప్ప.. మరెవరూ ఉండరు. మీనూ ఓవైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే, మరోవైపు అదే ఊళ్లో చిన్న పిల్లలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ ఉంటుంది. ధైర్య సాహసాలతోపాటు ఎదుటివారికి సాయం చేయడంలోనూ ఎప్పుడూ ముందుంటుంది. అలాంటి మీనూ.. ఒకరోజు ఎగ్జామ్ రాయడానికి స్నేహితురాలు ప్రియతో కలిసి సమీపంలోని పట్టణానికి వెళ్తుంది. కానీ, రాత్రయినా ఇంటికి తిరిగి రాదు. రవి ఫోన్ చేసి మాట్లాడితే.. ట్రాఫిక్‌లో ఇరుక్కున్నానని చెబుతుంది. ఫోన్‌లో మాట్లాడుతూనే.. ఎవరితోనో గొడవ పడుతుంది. ఆ మాటలు ఫోన్‌లోనే వింటాడు రవి. మళ్లీ కాల్ చేస్తే.. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దాంతో, కూతురు ఆపదలో పడిందని ఆందోళనకు గురవుతాడు. తోడుగా వెళ్లిన ప్రియ కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మరింత టెన్షన్ పడతాడు. అసలు మీనూ ఎవరితో గొడవ పడింది? ఈ క్రమంలో ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నది? అందులోంచి ఎలా బయటపడ్డది? ఈమధ్యలో మాస్టర్ (మోహన్ లాల్) ఎవరు? అతనికి, మీనూకి మధ్య ఉన్న అనుబంధం ఏంటి? అసలు.. మీనూ మిస్సింగ్ వెనక ఉన్న కథ ఏంటి? అది తెలియాలంటే.. సినిమా చూడాల్సిందే!

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999